


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**అంగరంగ వైభవంగా శ్రీనివాస కళ్యాణం**

- వెంకటపాలెం ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తి
- కళ్యాణం జరిగే ప్రాంతం సస్యశ్యామలం
- ఇది భక్తుల ప్రగాఢ విశ్వాసం..
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు


10

# ఆ ఐదేళ్లూ.. చీకటి రోజులు!

## శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడి

- 2019-24 మధ్య విద్యుత్ రంగం చీకట్లో మగ్గిపోయింది
- గత ప్రభుత్వ విధ్వంసం నుంచి 9 నెలల్లో గాడిన పెట్టాం
- ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధిస్తాం
- ఇప్పటివరకు రూ.5.19 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు
- సోలార్ విద్యుదుత్పత్తితో ప్రతి ఒక్కరికీ ఆదాయం కల్పిస్తా
- యూనిట్ కొనుగోలు ధర తగ్గించేందుకు ప్రయత్నం
- రూ.5.16 నుంచి రూ.4.80కి నియంత్రించాలన్నది లక్ష్యం
- 1998లో తెచ్చిన సంస్కరణలే ఆ రంగాన్ని నిలబెట్టాయి
- ప్రతి నియోజకవర్గంలో 10 వేల రూఫ్‌టాప్‌ల ఏర్పాటు
- పీఎం కుసుమ్ కింద 4 లక్షల పంపుసెట్లు
- రాబోయే నాలుగేళ్లలో విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదు
- డెమొక్రటైజ్ పవర్ జనరేషన్‌తో ఆదాయ వనరుగా విద్యుదుత్పత్తి

2





కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా అసెంబ్లీలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సీఎం చంద్రబాబు నాయుడు. మంత్రులు, ఎమ్మెల్యేలు కార్యక్రమానికి హాజరయ్యారు.

## రూ.1,21,659 కోట్ల పెట్టుబడులకు ఆమోదం



- సీఎం అధ్యక్షతన 4వ ఎస్ఐపీబీ సమావేశం
- 10 కొత్త ప్రాజెక్టుల ద్వారా 80,104 మందికి ఉద్యోగాలు
- వివిధ సంస్థల పెట్టుబడులు, ప్రాజెక్టుల పురోగతిపై ట్రాకింగ్
- 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు...
- ముందుగా 26 జిల్లాల్లో ఏర్పాటు
- నెల రోజుల్లో రాష్ట్రంలో ఐదుచోట్ల 5 రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలు
- ఎస్ఐపీబీ సమావేశంలో అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

3

## బీసీల సోలార్ రూఫ్‌టాప్‌కు రూ.20 వేల అదనపు సబ్సిడీ

పీఎం సూర్యఘర్‌లో బీసీలకు అదనపు రాయితీపై సీఎం ప్రకటన

3



నాగం గారూ.. ఎలా ఉన్నారు? మాజీ మంత్రి జనార్ధన్ రెడ్డికి సిఎం ఆత్మీయ పలకరింపు

### రక్షణ రంగంలో పెట్టుబడులకు

## విస్తారంగా అవకాశాలు

- ముఖ్యమంత్రికి డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ ప్రజెంటేషన్
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నారని వెల్లడి
- పెట్టుబడిదారులకు స్వాగతం పలుకుతామన్న సీఎం చంద్రబాబు

4



### ఇంటర్మీడియట్ విద్యలో

## కీలక సంస్కరణలకు శ్రీకారం!

- ఇక మ్యాథ్స్ ఎ-బి ఒకే సబ్జెక్ట్, బాటనీ-జువాలజీ ఒకే సబ్జెక్టు
- ఏప్రిల్ 1 నుంచే ప్రభుత్వ కళాశాలల ప్రారంభం
- ఫిబ్రవరి చివరి వారం నుంచే ఇంటర్మీడియట్ పరీక్షలు
- జూనియర్ కాలేజీల్లో ఎం.బైపిసి కోర్సుకు అనుమతి
- మంత్రి లోకేష్ అధ్యక్షతన జరిగిన ఇంటర్మీడియట్ బోర్డు సమావేశంలో నిర్ణయం

5



### ఏయు మాజీ వీసీ ప్రసాదరెడ్డి అక్రమాలపై

## విజిలెన్స్ విచారణ

- 60 రోజుల్లో విచారణ పూర్తిచేసి కఠిన చర్యలు తీసుకుంటాం
- ఆంధ్రా యూనివర్సిటీ ప్రమాణాలను పెంచి గతవైభవం తెస్తాం
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్ ప్రకటన

5





7

## అభివృద్ధిలో అగ్రగామిగా మంగళగిరి

- త్వరలోనే ఇళ్ల పట్టాల పంపిణీ
- ప్రముఖ దేవాలయాల తరహాలో లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ డీపీఆర్ సిద్ధం
- మంత్రి నారా లోకేష్ వెల్లడి



## యువతలో ఏఐ నైపుణ్యాలకు మైక్రోసాఫ్ట్‌తో కీలక ఒప్పందం

- ఏఐ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల్లో 2లక్షలమందికి శిక్షణ
- మంత్రి లోకేష్ సమక్షంలో మైక్రోసాఫ్ట్, ఏపీఎస్ఎస్‌డిసీ నడుమ అవగాహన

5

చైతన్యరథం

# ఆ ఐదేళ్లూ.. చీకటి రోజులు!

- 2019-24 మధ్య విద్యుత్ రంగం చీకట్లో మగ్గిపోయింది
- గత ప్రభుత్వ విధ్వంసం నుంచి 9 నెలల్లో గాడిన పెట్టాం
- ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధిస్తాం
- ఇప్పటివరకు రూ.5.19 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు
- సోలార్ విద్యుదుత్పత్తితో ప్రతి ఒక్కరికీ ఆదాయం కల్పిస్తా
- యూనిట్ కొనుగోలు ధర తగ్గించేందుకు ప్రయత్నం
- రూ.5.16 నుంచి రూ.4.80కి నియంత్రించాలన్నది లక్ష్యం
- 1998లో తెచ్చిన సంస్కరణలే ఆ రంగాన్ని నిలబెట్టాయి
- ప్రతి నియోజకవర్గంలో 10 వేల రూఫ్‌టాప్‌ల ఏర్పాటు
- పీఎం కుసుమ్ కింద 4 లక్షల పంపుసెట్లు
- రాబోయే నాలుగేళ్లలో విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదు
- డెమొక్రటైజ్ పవర్ జనరేషన్‌తో ఆదాయ వనరుగా విద్యుదుత్పత్తి
- శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడి

అమరావతి(చైతన్యరథం): '2019-24 మధ్యకాలం విద్యుత్ రంగానికి చీకటి రోజులు. గత ప్రభుత్వ విధ్వంసంతో కునారిల్లిన విద్యుత్ రంగాన్ని 9 నెలల్లోనే గాడిన పెట్టాం. గత పాలకుల అసమర్థతో విద్యుత్ వ్యవస్థను అంతుబట్టని సమస్యలు చుట్టుముట్టాయి. 30ఏళ్లుగా నా మనసుకు దగ్గరగా ఉండే విభాగం ఇంధనరంగం. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చిన ఘనత టీడీపీదే. క్లీన్ ఎనర్జీ పాలసీ ప్రకటించాక రూ.5.19 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఎంఓయూలు కుదుర్చుకున్నాం. దీనిద్వారా రాష్ట్రంలోని 3.66 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. రాబోయే ఐదేళ్లలో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడ మే ప్రభుత్వ లక్ష్యం. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పాం. ఆ మాటకు కట్టుబడి ఉన్నాం. యూనిట్ విద్యుత్ కొనుగోలు ధర రూ.5.16 నుంచి రూ.4.80కి తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. గురువారం శాసనసభలో విద్యుత్ రంగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు.

## రైతుకు పగటిపూటే 9 గంటల విద్యుత్ ఇచ్చాం

ఏ పని జరగాలన్నా విద్యుత్ అవసరం. నిజ జీవితంలో విద్యుత్ వినియోగం కీలకం. తలసరి విద్యుత్ వినియోగాన్ని బట్టి అభివృద్ధిని అంచనా వేస్తాం. ఇంధన రంగంలో అనేక మార్పులు వచ్చాయి. 30 ఏళ్లకు ముందున్న వ్యవస్థను చూశాను. ఇప్పుడున్న వ్యవస్థనూ చూస్తున్నాను. 2004కు ముందు మేం అసెంబ్లీలో ఉంటే ప్రతిపక్షాలు వెళ్లి విద్యుత్ సౌధ వద్ద ఆందోళనలు చేసేవి. నేను అసెంబ్లీ నుంచి బటయకు వెళ్లి పొలాలు చూసి వచ్చి మళ్లీ సభ్యులకు సమాధానం చెప్పేవాడిని. గతంలో గ్రామాల్లో కరెంట్ ఎప్పుడొస్తుందో తెలీదు. ఇక రైతులైతే కరెంట్ రాగానే ఒకేసారి మోటార్లు వేసేవారు. లోఓల్టేజ్ వల్ల మోటార్లు కాలిపోయేవి. నేను 2012లో పాదయాత్ర చేశాను. కొన్నిచోట్ల రైతులు చలిమంట వేసుకుని కరెంట్ కోసం కూర్చునేవారు. ఏంటిక్కడ కూర్చున్నారని అడిగితే, కరెంట్ కోసం చూస్తున్నామని చెప్పారు. చాలామంది రైతులు పాముకాటుకు గురయ్యేవారు. ఇవన్నీ చూశాక 2014లో అధికారంలోకి వచ్చాక 9 గంటల విద్యుత్ పగటిపూటే ఇచ్చాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పటి పరిస్థితిని వివరించారు.

## స్పాట్ బిల్లింగ్ విధానాన్ని తెచ్చాం


వ్యవసాయానికి ఎంతోకొంత రైతుల నుంచి వసూలు చేసేవారు. మేం వచ్చాక స్లాబ్ రేట్ తెచ్చి రైతులను ఆదుకున్నాం. దీంతో మీటర్ రీడింగ్ కోసం స్పాట్ బిల్లింగ్ విధానాన్ని తెచ్చాం. ప్రపంచమంతా అధ్యయం చేశాను. విద్యుత్‌రంగంలో సంస్కరణలు తీసుకొచ్చింది టీడీపీనే. అప్పుడు నన్ను ప్రతిపక్షాలు ప్రపంచ బ్యాంకు జీతగాడు అన్నారు. అయినా ప్రజల కోసం, రాష్ట్రంకోసం ఆ మాట పడ్డాను. 1995లో 10నుంచి 15 గంటలదాకా విద్యుత్ కోతలు ఉండేవి. 1998లో సంస్కరణలు దేశంలోనే మొట్టమొదటిసారి తెచ్చాం. ఎనర్జీ ఆడిటింగ్ విధానం తీసుకొచ్చాం. డిస్ట్రిబ్యూషన్, జనరేషన్, ట్రాన్స్‌మిషన్ కమిటీలుగా విభజించాం. కరెంట్ కొరతలను 2004 నాటికి అధిగమించాం. కరెంట్ కొరతలేని ఏకైక రాష్ట్రంగా ఏపీని తయారు చేశాం. ఆ ఫలితాలు చూసి సంతోషించా. కానీ అవి ప్రజలకు అర్థంకాకపోవడం 2004లో ఓడిపోవడానికి కారణమైంది. రాష్ట్రానికి లాభాలు వచ్చాయి. నాకు కష్టాలు వచ్చాయి' అని చంద్రబాబు చమత్కరించారు.

## 1998 సంస్కరణలను నిర్వీర్యం చేశారు

నేను సీఎంగా ఉన్న సమయంలో బొగ్గు నిల్వల సమస్య ఉండేది కాదు. నాణ్యత లేకుండా చేయడం, లేదంటే అసలు బొగ్గే లేకుండా చేయడంతో థర్మల్ పవర్ స్టేషన్లు సామర్థ్యం మేరకు పని చేయలేదు. 1998నాటి సంస్కరణలు నిర్వీర్యం చేశారు. 2012-13 మధ్య జాతీయస్థాయిలో విద్యుత్ లోటు 8.7 శాతం ఉంటే మన రాష్ట్రంలో 17.6 శాతం ఉండేది. విద్యుత్ రంగానికి బడ్జెట్ కేటాయింపులు కూడా 7.8 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. 1995 నుంచి 2004 మధ్య విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 90 శాతానికి పెంచితే తర్వాత 56 శాతానికి తగ్గించారు. 2004లో యూనిట్ విద్యుత్ ధర రూ.2.55 ఉంటే అది 2014నాటికి రూ.5.25కు పెంచారు. దీంతో వినియోగదారులపై మోయలేని భారంపడింది. విద్యుత్ కోతల్లేని పరిస్థితి నుంచి గంటలకొద్దీ కోతలు విధించే పరిస్థితికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ పదేళ్ల పాలనలో రైతులపై రూ.28,535 కోట్లు భారం వేశారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు.

## ఒక వ్యక్తి అహంవల్ల రూ.9 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చింది

2014లో అధికారంలోకి వచ్చాక మళ్లీ విద్యుత్ అంశంపై స్టడీ చేశాం. 22.5 మిలియన్ల కొరతవుంటే సవాల్‌గా తీసుకుని 2018 జనవరి నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దాం. జాతీయ తలసరి వినియోగం 17శాతం ఉంటే మనం 23 శాతానికి పెంచాం. సోలార్, విండ్‌ద్వారా 7,700 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశాం. ఏ రాష్ట్రం కూడా ఈ విధంగా చేయలేదు. ఐదేళ్లు కరెంట్ ఛార్జీలు పెంచకుండా నాణ్యమైన కరెంట్ అందించాం. 2019-24లో మధ్య మళ్లీ చీకటి రోజులు వచ్చాయి. అసమర్థ పాలన వల్ల ఇష్టానుసారంగా చేశారనడానికి ఇదొక కేస్ స్టడీ. విద్యుత్ రంగాన్ని మళ్లీ చీకట్లోకి నెట్టారు. ఏ రాష్ట్రంలోనైనా పీపీఏల ఆధారంగా పెట్టుబడులు పెడతారు. దావోస్‌లో కూడా పీపీఏల రద్దుపై చర్చలు జరిగాయి. వితండవాదంతో కావాలని అవినీతి ఆరోపణలు చేసి సోలార్ విద్యుత్ వాడలేదు.



హైకోర్టు మొట్టికాయలు వేసి.. రూ.9 వేల కోట్లు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. ఆనాడు కరెంట్ వాడుకుని ఉంటే మనకు సమస్యలు వచ్చేవి కాదు. ఒక అహంకారి వల్ల రూ.9 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చిందని చంద్రబాబు వివరించారు.

## గత ఐదేళ్లలో 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు

కృష్ణపట్నం స్టేజ్ 2, వీటీపీఎస్ స్టేజ్ 5 ఆలస్యమయ్యాయి. దీనివల్ల అదనపు విద్యుత్ అవసరమవుతోంది. పోలవరం హైడ్రో పవర్ కూడా ఆలస్యం వల్ల రూ.1044 భారం పడుతుంది. అవకతవక నిర్ణయాలు, అసమర్థతవల్ల రూ.62,826 కోట్లు ఉన్న అప్పులు రూ.1,12,422 కోట్లకు పెరిగింది. విపరీతంగా టారిఫ్‌లుపెంచి 9 సార్లు విద్యుత్ పెంచారు. రూ.32 వేల కోట్లు పేదలపై భారం వేశారు. 50 యూనిట్లు ఉపయోగించేవారిపై రూ.101 నుంచి రూ.199కి అనగా 98 శాతం, 100 యూనిట్లు వాడేవారికి రూ.244 నుంచి రూ.453కి అనగా 86శాతం, 200 యూనిట్లు వాడేవారికి రూ.632నుంచి రూ.1,123కి అనగా 78 శాతం, 300 యూనిట్లు వాడేవారికి రూ.1,573 నుంచి రూ.2,037కి అనగా 26 శాతం చొప్పున ఛార్జీలు పెంచారు. పేదలపై పెనుభారం వేశారు. టారిఫ్ సర్దుబాటు పేరుతో రూ.16,699 కోట్లు భారం వేశారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయిన నాకే ఈ రకరకాల పేర్లు అర్థం కాలేదు. ఫ్యూయల్ సర్‌ఛార్జ్ పేరుతో రూ.5,886 కోట్లు, ట్రూఅప్ ఛార్జీలు రూ.3,977 కోట్లు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.5,604 కోట్లు వేశారు. నేనున్నప్పుడు 6 పైసలు వేస్తే అది కూడా విద్యుత్ బోర్డే తీసుకునేది. 2019-24 మధ్య 9సార్లు ఛార్జీలుపెంచి రూ.32,166 కోట్లు భారం వేశారు. మళ్లీ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.6073 కోట్లు, 2023-24లో రూ.6544 కోట్లు ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్ట మెంట్ కోసం ఏపీఈఆర్సీలో పిటిషన్ వేశారు. గత ప్రభుత్వం పెంచిన ఛార్జీల భారం గతేడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో ప్రజలపై పడింది. పవర్ సరఫరా అగ్రిమెంట్, సెకీలు భారంగా అయ్యాయి. కానీ సంతకాలు పెట్టాక వెనక్కి తీసుకుంటే పెనాల్టీలు కట్టడంతో పాటు, విశ్వతనీయత పోతుంది. అయినప్పటికీ వీటన్నింటినీ సాకుగా చూపి తప్పించుకోవడానికి సిద్ధంగా లేను అని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ప్రతి నియోజవర్గంలో 10 వేల రూఫ్‌టాప్‌ల ఏర్పాటు

భూతాపం పెరుగుతోంది. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ, హైడల్, రెన్యూవబుల్, బ్యాటరీ విద్యుత్ వినియోగించుకునేందుకు కసరత్తు చేస్తున్నాం. కరెంట్‌ను ఇళ్లు, పరిశ్రమలు, వాహనాలకు వాడుతున్నాం. సస్టెయినబుల్ ఎకానమీ ఉండాలంటే గ్రీన్ ఎనర్జీ వినియోగం తప్ప మరో మార్గం లేదు. రాబోయే రోజుల్లో విమానాలు, ఓడలు కూడా గ్రీన్ ఎనర్జీతో నడిచేలా రాబోతున్నాయి. ఎనర్జీని ఎగుమతికి ఉపయోగించుకోబోతున్నాం. 500 గిగావాట్లు గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేస్తామని ప్రధాని మోదీ అన్నారు. అందులో మనం 160 గిగావాట్లు టార్గెట్ పెట్టుకున్నాం. పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన్ కింద ప్రతి ఒక్కరి ఇంట్లో విద్యుదుత్పత్తి చేసుకోవచ్చు. 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సూర్యఘర్ కింద 2 కిలోవాట్‌ల విద్యుదుత్పత్తికి రాయితీ అందిస్తాం. ఎమ్మెల్యేలు కూడా బాధ్యత తీసుకోవాలి. ఒక్కో నియోజకవర్గానికి 10 వేల ఇండ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసే బాధ్యత తీసుకోవాలి. ఉదాహరణకు 240 యూనిట్లు సూర్యఘర్ ద్వారా ఉత్పత్తి చేస్తే, అందులో 100 యూనిట్లు వినియోగదారులు వాడుకుంటే మరో 140 యూనిట్లు వారివద్ద ఉంటుంది. 9 ఏళ్ల పేబ్యాక్ పీరియడ్ అయిన తర్వాత సోలార్ రూఫ్‌టాప్ నుంచి గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఆదాయం వస్తుంది. ఉదాహరణకు 140 యూనిట్లు గ్రిడ్‌కు విక్రయిస్తే ఒక్కో కుటుంబానికి రూ.300 ఆదాయం వస్తుంది. నిర్వహణకు కూడా ఏజన్సీని పెడతాం. 3 కిలోవాట్స్‌కు రూ.78 వేలు సబ్సీడీ వస్తుంది. మిగతా 70 వేలకు అవసరమైతే పెట్టుబడి ప్రభుత్వమే పెడుతుంది. లేదంటే బ్యాంకు ద్వారా రుణం అందిస్తాం. ఈ పథకం ద్వారా 1,559 మెగావాట్ల ఉత్పత్తికి ఆస్కారం ఉంది. రూ.8,937 కోట్లు ఖర్చు అయ్యే ఈ ప్రాజెక్టులో కేంద్రం రూ.4,663 కోట్లు, రాష్ట్రం రూ.4,274 కోట్లు ఖర్చు చేస్తుందని చంద్రబాబు వివరించారు.

## పీఎం కుసుమ్ కింద 4 లక్షల పంపుసెట్లు


పీఎం కుసుమ్ కింద లక్ష వ్యవసాయ పంపుసెట్లను ఎమ్ఎన్ఆర్ఈ (మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ) కేటాయించింది. మనం మరో 4 లక్షల సోలార్ పంపుసెట్లు రాష్ట్రానికి కేటాయించాలని కోరాం. మొదటి దశ కింద రాష్ట్రంలో 3.85 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఏర్పాటు ద్వారా 1,327 మెగావాట్లు ఉత్పత్తి అవుతుంది. 220 మెగావాట్ల 49,533 సోలార్ అగ్రికల్చర్ పంపుసెట్లకు, 751 మెగావాట్ల 1,67,452 సోలార్ అగ్రికల్చర్ పంపుసెట్లకు విడివిడిగా టెండర్లు పిలిచాం. సబ్‌స్టేషన్ దగ్గర పవర్ జనరేషన్ జరుగుతుంది. రెన్యూవబుల్ ఎనర్జీలో 47.82 గిగావాట్లు రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి ఉంటుంది. ఇందులో 13.79 గిగావాట్ల సోలార్, 9.93 గిగావాట్ల విండ్, 24.10 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుదుత్పత్తి ఉంటుంది. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌ను కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించింది. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కేంద్రం ఇస్తోంది. 1000 మెగావాట్లకు రూ.270 కోట్లు వీజీఎఫ్ కేంద్రం ఇస్తోంది. జమ్మలమడుగు, ఘనిలో 225-450 మెగావాట్లు చొప్పున, కుప్పంలో 50-100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన బ్యాటరీ స్టోరేజీ సిస్టమ్ కోసం ఎంపికచేశాం. పంప్డ్ ఎనర్జీకంటే బ్యాటరీ స్టోరేజీ ఖర్చు ఎక్కువ. కరెంట్ చార్జీలు ఎందుకు పెరిగాయంటే.. 2014 నుంచి 2018 వరకు సగటు యూనిట్ కాస్ట్ రూ.4.40 అయ్యింది. 2019 నుంచి 24 వరకు సగటున యూనిట్ కొనుగోలుకు రూ.6.90 ఖర్చయ్యింది. ఈ అసమర్థ విధానపు భారాన్నే ప్రజలు మోయాల్సి వచ్చిందని వివరించారు.

## రాష్ట్రంలో 5 వేల ఈవీ స్టేషన్‌లు

ఎలక్ట్రిటిక్ వాహనాల వినియోగంలో వెనకబడి ఉన్నాం. గ్రీన్ ఎనర్జీలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి 30 కి.మీ ఒక ఛార్జింగ్ స్టేషన్ చొప్పున మొత్తం 5 వేల స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నాం. ఇవి కాకుండా 26.26 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి చేసేందుకు రూ.1.12 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు వచ్చాయి. పోలవరం హైడ్రో పవర్ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. రాబోయే ఐదేళ్లలో జెన్‌కో ద్వారా రూ.1.07 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తిచేసి మనకు కావాల్సిన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేందుకు ముందుకెళ్తున్నాం. ట్రాన్స్‌మిషన్ కెపాసిటీని 16,507 మెగావాట్లకు పెంచుతాం. దీనికి రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తాం' అని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు.

చైతన్యరథం

# రూ.1,21,659 కోట్లు పెట్టుబడులకు ఆమోదం





- సీఎం అధ్యక్షతన 4వ ఎస్ఐపీబీ సమావేశం
- 10 కొత్త ప్రాజెక్టుల ద్వారా 80,104 మందికి ఉద్యోగాలు
- వివిధ సంస్థల పెట్టుబడులు, ప్రాజెక్టుల పురోగతిపై ట్రాకింగ్
- 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు...
- ముందుగా 26 జిల్లాల్లో ఏర్పాటు
- నెల రోజుల్లో రాష్ట్రంలో ఐదుచోట్ల 5 రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలు
- ఎస్ఐపీబీ సమావేశంలో అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రానికి పెట్టుబడుల విషయంలో ఒప్పందం చేసుకున్న పరిశ్రమలు వెంటనే గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆమోదం తెలిపిన, ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టుల పురోగతిపై నిత్యం పరిశీలించాలని... దీనికోసం ట్రాకర్‌ను ఏర్పాటుచేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. గురువారం సచివాలయంలో సీఎం అధ్యక్షతన జరిగిన 4వ ఎస్ఐపీబీ సమావేశంలో రాష్ట్రానికి కొత్తగా వస్తున్న పెట్టుబడుల ప్రతిపాదనలను చంద్రబాబు పరిశీలించారు. పరిశ్రమలు, విద్యుత్, పర్యాటకంవంటి రంగాల్లో మొత్తం 10 సంస్థలు రూ.1,21,659 కోట్లు పెట్టుబడులతో ముందుకురాగా ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపారు. వీటిద్వారా 80,104 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. అలాగే, గత మూడు ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టులు, వాటి పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ చొప్పున మొత్తం 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా మొదట జిల్లాకు ఒకటి చొప్పున 26 జిల్లాల్లో తక్షణం 26 ఎంఎస్ఎంఈ పార్కులు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను నెలరోజుల్లోగా రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో 5 సెంటర్లు నెలకొల్పాలని చెప్పారు. పెట్టుబడులు గ్రౌండ్ అయ్యే వరకు ఆయా సంస్థల వెనుకపడాలని.... నిరంతరం ఫాలోఅప్ చేయాలని సూచించారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు వేగంగా అనుమతులు ఇవ్వడంతో పాటు... క్షేత్రస్థాయిలో ఆయా ప్రాజెక్టులు పనులు మొదలుపెట్టేలా చూడాలన్నారు. ఈ విషయంలో అటు మంత్రులు, ఇటు అధికారులు మరింత వేగంగా పనిచేయాలని సీఎం సూచించారు. అప్పుడే ప్రతి ఏడాది ప్రగతి, ఫలితం కనిపిస్తుందని అభిప్రాయపడ్డారు.

### 4వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన సంస్థల వివరాలు

1) ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్, నాయుడుపేట – రూ.1,742 కోట్ల పెట్టుబడులు, 2,000 ఉద్యోగాలు.
2) దాల్మియా సిమెంట్, కడప జిల్లా –రూ.2,883 కోట్ల పెట్టుబడులు, 354 ఉద్యోగాలు.
3) లులూ గ్లోబల్ ఇంటర్నేషనల్, విశాఖపట్నం – రూ.1,500 కోట్ల పెట్టుబడులు.
4) సత్యవేడు రిజర్వ్ ఇన్ఫ్రాసిటీ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీసిటీ –రూ.25,000 కోట్ల పెట్టుబడులు, 50,000 ఉద్యోగాలు.
5) ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ –రూ.58,469 కోట్ల పెట్టుబడులు, 13,050 ఉద్యోగాలు.
6) బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ –రూ.1,175 కోట్లు, 1,500 ఉద్యోగాలు.
7) ఏపీ ఎన్జీఈఎల్ హరిత్ అమ్రిత్ లిమిటెడ్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు –రూ.22,000 కోట్ల పెట్టుబడులు, 8,300 ఉద్యోగాలు
8) ఆస్త్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అన్నమయ్య, కడప జిల్లాలు –రూ.8,240 కోట్లు, 4,000 ఉద్యోగాలు.
9) మేఫెయిర్ బీచ్ రిసార్ట్, కన్వెన్షన్ –రూ.400 కోట్ల పెట్టుబడులు, 750 ఉద్యోగాలు.
10) ఒబెరాయ్ విలాస్ రిసార్ట్ –రూ.250 కోట్ల పెట్టుబడులు, 150 ఉద్యోగాలు.

గత మూడు ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు ఇవీ.

మొదటి ఎస్ఐపీబీ సమావేశంలో విద్యుత్ రంగంలో రూ.11,902 కోట్లు, ఇతర రంగాల్లో రూ.72,085 కోట్లు... మొత్తం రూ.83,987 కోట్లు పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. దీంతో 29,585 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

రెండవ ఎస్ఐపీబీ సమావేశంలో విద్యుత్ రంగంలో రూ.83,000 కోట్లు, ఇతర రంగాల్లో రూ.99,162 కోట్లు... మొత్తం రూ. 1,82,162 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ పెట్టుబడులతో 2,63,411 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

మూడవ ఎస్ఐపీబీ సమావేశంలో విద్యుత్ రంగంలో రూ.42,932 కోట్లు, ఇతర రంగాల్లో 1,844 కోట్లు... మొత్తం రూ. 44,776 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. వీటిరాకతో 19,580 ఉద్యోగాలు లభిస్తాయి.

ఇప్పటివరకు నాలుగు ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.4,32,584 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా మొత్తం 3,92,680 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి.

# నాగం గారూ.... ఎలా ఉన్నారు?

## మాజీ మంత్రి జనార్ధన్ రెడ్డికి సిఎం ఆత్మీయ పలకరింపు



అమరావతి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. చాలాకాలం తరువాత తనను కలిసిన నాగంను సీఎం చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. 'నాగం గారూ... ఎలా ఉన్నారు? ఆరోగ్యం ఎలా ఉంటుంది? చాలా రోజులైంది కలిసి..' అంటూ పలకరించారు. పిల్లలేంచేస్తున్నారని ఆరా తీశారు. నాగం కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్న చంద్రబాబు... ఆరోగ్యం జాగ్రత్త అంటూ మర్యాదపూర్వక సూచన చేశారు. ఓబుళాపురం మైనింగ్ అంశంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం నేతలు చేసిన ఉద్యమాలపై నాడు కేసులు నమోదయ్యాయి. కేసుల విచారణలో భాగంగా విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టుకు నాగం జనార్ధన్‌రెడ్డి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆనాటి కేసులను ఎట్టకేలకు కొట్టివేయడంపై చంద్రబాబు హర్షం వ్యక్తంచేశారు.

భేటీ సందర్భంగా ఇరువురు నేతలు పలు పాత ఘటనలను గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాడు చేసిన ప్రజా పోరాటాలను చర్చించుకున్నారు. నాగం ఫైర్ బ్రాండ్‌గా ఉండేవారని... పార్టీ ఆదేశిస్తే దూసుకుపోయే వాళ్లని ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యానించారు. ఎంతో ఎమోషన్‌గా ఉండేవారంటూ నాటి ఘటనలను గుర్తు చేసుకున్నారు. నాల్గవసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబును చూడడం సంతోషాన్నిచ్చిందని ఈ సందర్భంగా నాగం వ్యాఖ్యానించారు. రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలి... తెలుగు ప్రజలు అన్ని రంగాల్లో విజయాలు సాధించాలనేదే తన అభిమతమని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### బీసీల సోలార్ రూఫ్‌టాప్‌కు

# రూ.20 వేల అదనపు సబ్సిడీ

#### పీఎం సూర్యఘర్‌లో బీసీలకు అదనపు రాయితీపై సీఎం ప్రకటన

అమరావతి (చైతన్య రథం): పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు కేంద్రం ఇచ్చే రాయితీకి అదనంగా రూ.20 వేలు సబ్సిడీ రూపంలో అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభలో ప్రకటించారు. 2 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ. 1.2 లక్షలు వరకు ఖర్చవుతుండగా కేంద్రం రూ.60 వేలు రాయితీగా అందిస్తుంది. అయితే బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మరో రూ.20 వేలు అదనంగా రాయితీ



అందించనున్నట్టు సీఎం చంద్రబాబు తెలిపారు. దీని ప్రకారం 2 కిలోవాట్ల రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు రాష్ట్రం కూడా ఇచ్చే రాయితీతో కలిపి రూ.80 వేల వరకు సబ్సిడీ అందుతుంది. బీసీ వర్గాలకు అండగా ఉండాలనే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించారు.

## రక్షణ రంగంలో పెట్టుబడులకు

# విస్తారంగా అవకాశాలు



- ముఖ్యమంత్రికి డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ ప్రజెంటేషన్
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నారని వెల్లడి
- పెట్టుబడిదారులకు స్వాగతం పలుకుతామన్న సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పెద్దఎత్తున పరిశ్రమలు స్థాపించేలా కృషి చేస్తున్న డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి సతీష్‌రెడ్డి గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అవకాశాలను, ముఖ్యంగా డిఫెన్స్ రంగంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు సంబంధించి ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం 50మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేలా సహకారం అందిస్తానని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటు కావాలని కోరగా... దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరు ముందుకు వచ్చినా స్వాగతం పలుకుతామని, సత్వర అనుమతులతో సహా అవసరమైన మౌలిక సదుపాయాలు, భూకేటాయింపులు చేస్తామని సతీష్ రెడ్డికి ముఖ్యమంత్రి చెప్పారు. సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, అమలాపురం ఎంపీ హరీష్ ఉన్నారు.





కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా అసెంబ్లీలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సీఎం చంద్రబాబునాయుడు. మంత్రులు, ఎమ్మెల్యేలు కార్యక్రమానికి హాజరయ్యారు.

## టిడ్కో ఇళ్లల్లో మౌలిక వసతుల కల్పనకు

# హడ్కో రూ.4,460 కోట్ల రుణం

- టిడ్కో లబ్ధిదారులను మోసగించిన గత ప్రభుత్వం
- ఇళ్లు చేతికివ్వకుండానే లబ్ధిదారుల పేరిట బ్యాంకుల్లో రుణాలు
- అసెంబ్లీలో మంత్రి నారాయణ



అమరావతి (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను దారుణంగా మోసగించిందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి నారాయణ అన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల తొలగింపు, మౌలిక వసతుల కల్పనపై అసెంబ్లీలో గురువారం సభ్యుల ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం 22,640 మంది టిడ్కో లబ్ధిదారులను తొలగించి వేరే వారికి ఇళ్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. కేవలం 57వేల 40 ఇళ్లను మాత్రమే వైసీపీ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. లబ్ధిదారుల మార్పులో అవకతవకలపై కమిటీ వేసి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇబ్బందులున్న మాట వాస్తవమే. 77,606 మందికి ఇళ్లు ఇవ్వకుండానే వారి పేరు మీద బ్యాంకులో రుణాలు తీసుకున్నారు. దీనివల్ల ఇల్లు చేతికి రాకుండానే లబ్ధిదారులపై ఈఎంఐ భారం పడుతోంది. బ్యాంకులు కూడా ఈ రుణాలపై ఎన్పీఏ కి వెళుతున్నాయి. బ్యాంకులకు రుణం చెల్లించేందుకు సీఎం చంద్రబాబు రూ.140 కోట్లకు అనుమతించారు. త్వరలోనే బ్యాంకులకు ఈ బకాయిలు చెల్లిస్తాం. టిడ్కో ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు హడ్కో రూ.4460 కోట్లు రుణం ఇస్తుంది. అర్బన్ అథారిటీల సహకారంతో మౌలిక వసతుల కల్పన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. జూన్ 12 నాటికి పెండింగ్‌లో ఉన్న 365, 430 చదరపు అడుగుల ఇళ్లను పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు.

### అనకాపల్లి వరకూ మెట్రో రైల్ ప్రతిపాదన లేదు

విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి అనకాపల్లి వరకు మెట్రో రైలు పొడిగింపు ప్రతిపాదన లేదని మంత్రి నారాయణ తెలిపారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు గురువారం మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. విశాఖలో మెట్రో రైల్ కారిడార్లపై 2051నాటికి ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని డీపీఆర్ రూపొందించామని తెలిపారు. పీక్ అవర్ పాసింజర్ డైవర్షన్ ట్రాఫిక్ ఆధారంగా మెట్రో రైల్ పై కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది. స్టీల్ ప్లాంట్ నుంచి అనకాపల్లి వరకు పీక్ అవర్ ట్రాఫిక్ తగినంత లేకపోవడంతో మెట్రో రైలు కుదరదని కేంద్రం చెప్పింది. ట్రాఫిక్ రద్దీ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు.

## తెలుగు సాహిత్యంలో

# చెరగని ముద్ర వేసిన మొల్ల

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత నివాళి



అమరావతి(చైతన్యరథం): తెలుగు సాహిత్యంలో కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ(మొల్ల) చెరగని ముద్ర వేశారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత కొనియాడారు. తెలుగు సాహిత్యంలో ఆమె రచనలకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. గురువారం మొల్ల జయంతి సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో ఆమె చిత్రపటానికి మంత్రి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, సామాన్య కుమ్మరి కుటుంబంలో జన్మించిన మొల్లమాంబ శ్రీరాముడిని అచంచలమైన భక్తి ప్రపత్తులతో కొలిచారన్నారు. వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి అనువదించించిన మహనీయురాలు మొల్ల అని కొనియాడారు. తెలుగు వాడుక భాషలో ఆమె రచించిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రఖ్యాతగాంచిందన్నారు. మొల్ల తన రచనలలో నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చేవారన్నారు. తెనాలి రామలింగడు వంటి దిగ్గజ కవులకు మొల్ల సమకాలీనురాలు అని చరిత్ర చెబుతోంది. కడపలోని గోపవరం గ్రామంలో జన్మించిన మొల్ల నేటి తరం మహిళలకు, కవయిత్రులకు ఆదర్శమని కొనియాడారు. ఆమె రచనలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

## ఇంటర్మీడియట్ విద్యలో

# కీలక సంస్కరణలకు శ్రీకారం!

- ఇక మ్యాథ్స్ ఎ-బి ఒకే సబ్జెక్ట్, బాటనీ-జువాలజీ ఒకే సబ్జెక్టు
- ఏప్రిల్ 1 నుంచే ప్రభుత్వ కళాశాలల ప్రారంభం
- ఫిబ్రవరి చివరి వారం నుంచే ఇంటర్మీడియట్ పరీక్షలు
- జూనియర్ కాలేజిల్లో ఎం.బైపిసి కోర్సుకు అనుమతి
- మంత్రి లోకేష్ అధ్యక్షతన ఇంటర్మీడియట్ బోర్డు సమావేశంలో నిర్ణయం



అమరావతి (చైతన్యరథం): విస్తృత ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పచ్చజెండా ఊపారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ 77వ సమావేశం అమరావతి అసెంబ్లీలోని పేషీలో గురువారం మంత్రి లోకేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఇంటర్మీడియట్ విద్యలో నాణ్యత ప్రమాణాలను పెంపొందించి విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కాలేజిలవైపు ఆకర్షించేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులను తయారుచేసేందుకు 2025-26 విద్యాసంవత్సరం నుంచి క్యాలెండర్‌లో మార్పులు చేపట్టారు. ఈ విద్యా సంవత్సరం నుంచి జూన్ 1వ తేదీకి బదులుగా ఏప్రిల్ 1 నుంచే ప్రభుత్వ కళాశాలలు ప్రారంభమవుతాయి. జూన్ 1వ తేదీకి బదులుగా ఏప్రిల్ 7 నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభిస్తారు.

2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులకు వార్షిక పరీక్షలను 2026,మార్చికి బదులుగా ఫిబ్రవరి చివరి వారం నుంచే నిర్వహిస్తారు. ట్యాబులేషన్ రిజిస్టర్లను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని నిర్ణయించారు. డిజిలాకర్,వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సజావుగా ఆన్‌లైన్ యాక్సెస్ ఉండేలా 1973నుండి 2003 వరకు ఇంటర్మీడియట్ బోర్డు ఫలితాల డేటాను డిజిటలైజ్ చేస్తారు.

విద్యార్థులకు సబ్జెక్టుల ఎంపికలో సౌలభ్యాన్ని పెంచి, బహుళవిభాగ అభ్యాసాలను ప్రోత్సహించడానికి ఈ విద్యాసంవత్సరం నుంచే మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎలక్టివ్ సబ్జెక్టులను 2వ సబ్జెక్టుగా ప్రవేశపెట్టనున్నారు. లాంగ్వేజెస్, సైన్స్, హ్యూమాని టీస్ విభాగాల్లోని 24ఆప్షన్స్‌లో ఒక సబ్జెక్టును 2వ సబ్జెక్టుగా ఎంపికచేసుకోవచ్చు. జూనియర్ కళాశాలల్లో ఎంబైపిసి ప్రవేశపెట్టాలనే ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ఈ విద్యాసంవత్సరం నుంచి మ్యాథ్స్,బయాలజీ సబ్జెక్టులు అంతర్భాగాలుగా 6 సబ్జెక్టులతో ఎం.బైపిసి కోర్సును ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు 14 సబ్జెక్టులకు (సైన్స్, హ్యూమానిటీస్, లాంగ్వేజెస్ సహా) సవరించిన సిలబస్‌తో కొత్త పాఠ్యపుస్తకాలు ఈ విద్యా సంవత్సరం నుంచే అమలులోకి వస్తాయి.

ఇంటర్మీడియట్‌లో ఇప్పటి వరకు రెండు సబ్జెక్టులుగా పరిగణిస్తున్న మ్యాథ్స్ ఎ, బిలను ఇకపై ఒకే సబ్జెక్టుగా విలీనం చేశారు.

అలాగే బైపిసి విద్యార్థులకు బాటనీ, జువాలజీలు కలిపి ఒకే సబ్జెక్టు ఉండేలా విలీనంచేశారు. ఈ విలీనం వల్ల ఆయా సబ్జెక్టులకు సమాన వెయిటేజీ లభిస్తుంది. ఈఏపిసెట్, జెఇఇ, నీట్ వంటి పరీక్షలకు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులను సన్నద్ధం చేయడానికి సమగ్ర పోటీ పరీక్షల కోచింగ్ మెటీరియల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు తయారు చేస్తుంది. ఈ మెటీరియల్ బోర్డు పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తారు.

కాంపిటీటివ్ బేస్డ్ ఎసెస్‌మెంట్ కోసం ఇంటర్మీడియట్, సైన్స్, హ్యూమనిటీస్ విభాగాల ప్రశ్నల్లో 10 శాతం తప్పనిసరిగా బహుళ-ఎంపిక ప్రశ్నలు (MCQలు),ఖాళీలను పూరించే రూపంలో ఒక మార్కు ప్రశ్నలు ఉండేలా కొశ్చన్ పేపర్ రూపొందించాలని నిర్ణయించారు. NSQF స్థాయి ప్రకారం సిలబస్ సవరణ, వృత్తి విద్యార్థుల కోసం డ్యుయల్ సర్టిఫికేషన్‌ను ప్రవేశపెట్టనున్నారు. నైపుణ్య పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడానికి వీలుగా ప్రమాణాలను నిర్ణయించారు. సమగ్ర నిబంధనలను అభివృద్ధి చేయడం, NSQF స్థాయి ప్రకారం వృత్తిపరమైన సిలబస్‌ను మెరుగుపరచడం కోసం భారత ప్రభుత్వ జాతీయ మండలితో సహకరించేలా ప్రణాళికరూపొందించారు. వృత్తిపరమైన కోర్సుల పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు పరిశ్రమలకు అవసరాలకు తగ్గట్టుగా సవరించడానికి వీలుగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటయ్యే పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకోవాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నారాయణ భరత్‌గుప్త, ఇంటర్మీడియట్ విద్యడైరెక్టర్ కృతికాశుక్లా, పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు, సమగ్ర శిక్ష స్పెషల్ ప్రాజెక్ట్ డైరక్టర్ బి.శ్రీనివాస్‌రావు, ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ జి.గణేష్ కుమార్, ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి, సెకండరీ ఎడ్యుకేషన్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఓపెన్ స్కూల్స్ సెక్రటరీ నరసింహరావు, ఆంధ్రా వర్సిటీ వైస్ చాన్సలర్ జివి రాజశేఖర్, పద్మావతి వర్సిటీ వీసీ వి.ఉమ, ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ శారద రాజ్యలక్ష్మిదేవి, ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డిఎస్‌విఎల్ నరసింహం, విశాఖపట్నం విఎస్ కె డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, మొవ్వ క్షేత్రయ్య గవర్నమెంట్ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ ప్రసాద్ శాస్త్రి, కర్నూలు ఎపి రెసిడెన్షియల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జయం శ్రీనివాస గుప్త, క్రోసూరు ఎపిఎంఎస్ ప్రిన్సిపాల్ శ్రీమతి మేరీ సుశాన్, నాదండ్ల కెజిబివి ప్రిన్సిపాల్ మాధవీ లత, నారాయణ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ ఆనంద్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి అక్రమాలపై

# విజిలెన్స్ విచారణ

- 60 రోజుల్లో విచారణ పూర్తిచేసి కఠిన చర్యలు తీసుకుంటాం
- ఆంధ్రా యూనివర్సిటీ ప్రమాణాలను పెంచి గతవైభవం తెస్తాం
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్ ప్రకటన

అమరావతి (చైతన్యరథం): ఆంధ్ర యూనివర్సిటీలో మాజీ వీసీ ప్రసాదరెడ్డి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై 60రోజుల్లో విజిలెన్స్ విచారణ పూర్తిచేసి, కఠినమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి అవినీతి, అక్రమాలపై శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణ, గణబాబు, విష్ణుకుమార్ రాజు, కొణతాల రామకృష్ణ గురువారం అడిగిన ప్రశ్నలపై మంత్రి నారా లోకేష్ సమాధానమిస్తూ... గతంలో జరిగిన అవకతవకలపై సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. మాకు అందిన సమాచారం ప్రకారం రూ.20 కోట్ల రూసా గ్రాంట్ దుర్వినియోగం, ఇస్రో నుంచి వచ్చిన రూ.25లక్షలను ఖర్చుచేసిన విషయంలో కూడా నిబంధనలు ఉల్లంఘించారని ఫిర్యాదు అందింది. అవినీతి, అధికార దుర్వినియోగం, విద్యార్థులను రాజకీయ కార్యక్రమాలకు ఉపయోగించారని కూడా మా దృష్టికి వచ్చింది. మాజీ ముఖ్యమంత్రి జగన్ విశాఖపట్నం వెళితే ఆయనకు స్వాగతం పలికేందుకు తరగతులు నిలిపేసి విద్యార్థులను రోడ్లపై నిలిపారు. ఏయు రిజిస్ట్రార్‌తో సహా ఇల్లీగల్ అపాయింట్‌మెంట్స్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షల నిర్వహణలో ప్రైవేటు కళాశాలల నుంచి లంచాలు తీసుకోవడం,రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి అప్పటి అధికారపార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించడం,



యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్లను, ప్రిన్సిపాళ్లను నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగించడం వంటి తీవ్రమైన అభియోగాలు నాటి వైస్ ఛాన్సలర్‌పై వచ్చాయి. దీనిపై ఇన్‌చార్జి వీసీ ఒక కమిటీని నియమించి, అవకతవకలపై నివేదిక కోరారు. సభ్యుల విజ్ఞప్తి మేరకు 60రోజుల్లో విజిలెన్స్ ఎంక్వయిరీ పూర్తిచేసి, నివేదికను ప్రభుత్వానికి పంపించాలని ఆదేశిస్తున్నాం.

విజిలెన్స్ నివేదికను సభ్యులకు అందించే బాధ్యత నేను తీసుకుంటా. రిపోర్టు వచ్చిన వెంటనే వర్సిటీలో అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం, ఎవరినీ ఉపేక్షించేది లేదు, మరోసారి పొరపాటు చేయాలంటే భయపడేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. యూనివర్సిటీ సెంటిమెంట్‌తో కూడినది, ఏయులో చదివిన ఎందరో ప్రముఖులు పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులుగా రాణించారు. ఏయులో విద్యనభ్యసించిన వ్యక్తి ఈ రోజు బ్యాంక్ ఆఫ్ అమెరికా చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. జీఎంఆర్, చాలామంది శాసనసభ్యులు ఏయులో చదువుకుని ఈస్థాయికి వచ్చారు. ముఖ్యమంత్రి నన్ను విద్యాశాఖ మంత్రిగా నియమించేటప్పుడు రాబోయే అయిదేళ్లలో ఒక ప్రభుత్వ విశ్వవిద్యాలయమైనా క్యూఎస్ ర్యాంకింగ్ టాప్ -100లో ఉండాలని చెప్పారు. అందులో భాగంగా ఐఐటి ఖరగ్‌పూర్‌లో మ్యాథ్స్ ప్రొఫెసర్‌గా పనిచేసిన రాజశేఖర్‌ని ఏయు వీసీగా నియమించాం. ఆంధ్రా యూనివర్సిటీలో విద్యా ప్రమాణాలను పెంచి, గతవైభవం తెస్తాం. సంస్కరణలు తీసుకురావాలని, కరిక్యులమ్‌ను బలోపేతం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

చైతన్యరథం

## యువతలో ఏఐ నైపుణ్యాలకు

# మైక్రోసాఫ్ట్‌తో కీలక ఒప్పందం

- ఏఐ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల్లో 2లక్షలమందికి శిక్షణ
- మంత్రి లోకేష్ సమక్షంలో మైక్రోసాఫ్ట్, ఏపీఎస్ఎస్‌డిసీ నడుమ అవగాహన





అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని యువతకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల్లో నైపుణ్యాభివృద్ధి కోసం అంతర్జాతీయస్థాయి ప్రఖ్యాత సంస్థ మైక్రోసాఫ్ట్‌తో ఏపీ ప్రభుత్వం కీలకమైన ఒప్పందం చేసుకుంది. అమరావతి సచివాలయంలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు గురువారం ఎంఓయుపై సంతకాలు చేశారు. వృత్తి విద్య, మాధ్యమిక పాఠశాల పిల్లలు, యువతలో ఏఐ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలలో ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించి రాష్ట్రంలో ఐటి ఆధారిత, ఇతర పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యవంతమైన సిబ్బందిని తయారు చేయడం ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఈ ఒప్పందం ప్రకారం ఏపీలో ఏడాది వ్యవధిలో 2 లక్షల మంది యువతకు మైక్రోసాఫ్ట్ సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయంగా ఏఐ, అధునాతన టెక్నాలజీల్లో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని, ఉద్యోగావకాశాలు పొందేందుకు మైక్రోసాఫ్ట్ శిక్షణ ఉపకరిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని 50 గ్రామీణ ఇంజనీరింగ్ కళాశాలల్లో 500మంది అధ్యాపకులు, 10వేలమంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ పై మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొని ఉన్న 30 ఐటిఐలలో 30వేలమంది విద్యార్థులకు డిజిటల్ ప్రొడక్టివిటీలో ఏఐ శిక్షణను అందిస్తారు. ఏపీలో యునిసెఫ్ భాగస్వామ్యంతో పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్ 2.0ని ప్రవేశపెట్టేందుకు వీలుగా 40వేల మందికి, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ సహకారంతో మరో 20వేల మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తారు. ప్రభుత్వ పౌర సేవలను మెరుగుపర్చడంతోపాటు ప్రభుత్వాధికారుల్లో సామర్థ్యం పెంపుదలకు 50వేల మందికి 100 గంటలపాటు ఏఐ శిక్షణ అందిస్తారు. తద్వారా ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో సివిల్ సర్వీసెస్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తారు. శాఖల మధ్య సహకారంపై స్వీయ-అభ్యసన మార్గాలు, వర్క్‌షాప్‌లు, వెబినార్‌ల ద్వారా 20వేలమంది మంది సిబ్బందికి ఏఐ అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌ను అందిస్తారు. ఆయా ప్రాంతాల్లో ఏఐ శిక్షణకు అవసరమైన భౌతిక మౌలిక సదుపాయాలను ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సమకూరుస్తుంది. ఏఐ శిక్షణ అందించడానికి ఆయా విభాగాలను సమన్వయ పరుస్తుంది. విద్యాసంస్థల్లో ఏఐ పాఠ్యాంశాలను ప్రవేశపెట్టేందుకు అవసరమైన శిక్షణ, సర్టిఫికేషన్‌ను మైక్రోసాఫ్ట్ అందజేస్తుందని మంత్రి లోకేష్ చెప్పారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి గణేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ కుమార్, మైక్రోసాఫ్ట్ సౌత్ హెడ్ ఫర్ గవర్నమెంట్ బిజినెస్ దినేష్ కనకమేడల, మైక్రోసాఫ్ట్ ఇండియా - సౌత్ ఏషియా డైరెక్టర్ సందీప్ బంద్వేద్కర్, తదితరులు పాల్గొన్నారు.

# మాస్టారు.. మీరు సూపర్

## - జెడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్‌కు మంత్రి లోకేష్ అభినందనలు

- విద్యార్థులు చదువులో వెనకబడుతున్నారని హెడ్మాస్టర్ ఆవేదన
- పిల్లలను దండించకుండా వారి ముందు తానే గుంజీలు తీసిన వైనం
- వైరల్‌గా మారిన వీడియో
- ఎక్స్‌లో అభినందనలు తెలిపిన మంత్రి లోకేష్
- అందరం కలిసి ప్రభుత్వ స్కూళ్లను బాగుచేద్దామని పిలుపు



అమరావతి (చైతన్యరథం): స్కూల్లో పిల్లలు తప్పు చేస్తే టీచర్లు మందలించడం సహజం. ఒక్కోసారి అల్లరి శృతిమించినా, చదవకపోయినా దండిస్తారు కూడా. కానీ విజయనగరం జిల్లాలో ఓ హెడ్మాస్టర్ మాత్రం కొత్తగా ఆలోచించారు. చెప్పిన మాట వినని పిల్లల విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయం ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఆయన చేసిన పని ఏకంగా విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి వెళ్లింది. హెడ్మాస్టర్ ఆలోచనను మంత్రి కూడా మెచ్చుకున్నారు.

పిల్లల ముందే ఓ హెడ్మాస్టర్ గుంజీలు తీశారు. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పెంట జెడ్పీ హైస్కూల్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. పిల్లల విద్యా పురోగతి అంతంత మాత్రంగా ఉందని, చెప్పిన మాట వినడంలేదంటూ వారిని హెడ్మాస్టర్ చింత రమణ దండించలేదు పిల్లల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు సరికొత్త ఆలోచనకు నాంది పలికారు. స్కూల్ పిల్లలందరినీ ఒక్క దగ్గర చేర్చి వారి ముందు తనను తాను శిక్షించుకున్నారు. ఆ విద్యార్థుల ముందే హెడ్మాస్టర్ గుంజీలు తీశారు. ప్రస్తుతం హెడ్మాస్టర్ గుంజీలు తీస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై మంత్రి లోకేష్ ఎక్స్‌లో స్పందించారు.

### లోకేష్ ట్వీట్ ఇదే..

విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పెంట జెడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ చింత రమణ పిల్లల విద్యా పురోగతి అంతంతమాత్రంగా ఉందని, చెప్పిన మాట వినడంలేదని విద్యార్థులను దండించకుండా, తానే గుంజీలు తీసిన వీడియో సోషల్ మీడియా ద్వారా నా దృష్టికి వచ్చింది. హెడ్మాస్టరు గారూ! అంతా కలిసి పనిచేసి, ప్రోత్సాహం అందిస్తే మన ప్రభుత్వ పాఠశాలల పిల్లలు అద్భుతాలు సృష్టిస్తారు. వారిని దండించకుండా అర్థం చేసుకునేలా మీ స్వీయ క్రమశిక్షణ చర్య ఆలోచన బాగుంది, అభినందనలు. అందరం కలిసి విద్యా ప్రమాణాలు పెంచుదాం. పిల్లల విద్య, శారీరక, మానసిక వికాసానికి కృషి చేసి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం' అంటూ మంత్రి లోకేష్ ఎక్స్ వేదికగా తెలియజేశారు.

# మంత్రి లోకేష్ మాట 24 గంటల్లో కార్యాచరణ బాట

- కాశీనాయన ఆశ్రమం షెడ్లు కూల్చేసిన అటవీ అధికారులు
- ప్రభుత్వం తరపున ఆశ్రమ నిర్వాహకులకు క్షమాపణలు చెప్పిన మంత్రి
- షెడ్లు తన సొంత నిధులతో పునర్ నిర్మిస్తానని మాటిచ్చిన లోకేష్
- హామీ ఇచ్చిన 24 గంటల్లో షెడ్ల పునర్నిర్మాణం ప్రారంభం

అమరావతి (చైతన్యరథం): కాశీనాయన ఆశ్రమంవద్ద అటవీ అధికారులు కూల్చిన పలు షెడ్లను సొంత నిధులతో నిర్మిస్తానని హామీ ఇచ్చిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 24 గంటల్లోనే పునర్‌నిర్మాణం పనులుప్రారంభించారు. కూల్చిన షెడ్ల శిథాలాలను తొలగించి నూతన షెడ్ల నిర్మాణ పనులను మొదలుపెట్టారు.

విలువలు అంటే ఆచరించకుండా పోస్టర్లు వేసుకుని ప్రచారం చేసుకునేవి కావు. విశ్వసనీయత అంటే ఇచ్చిన మాట తప్పడమూ కాదు. విలువలు అంటే.. కాశీనాయన ఆశ్రమం షెడ్లు కూల్చివేసి, అటవీశాఖ అధికారులు తప్పుచేసినా, బాధ్యత గల మంత్రిగా తప్పునసరిదిద్దే చర్యలను నారా లోకేష్ తీసుకున్నారు. ఇవీ విలువలు అంటే. ఆశ్రమ నిర్వాహకులు జీరయ్యస్వామితో మంత్రి లోకేష్ ఫోన్‌లో మాట్లాడారు. జరిగిన సంఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. ఇకపై ఏ అవ సరం వచ్చినా, ఏ సమస్య ఉన్నా తననే నేరుగా సంప్రదించాలని స్వామికి భరోసా ఇచ్చారు. విశ్వసనీయత అంటే.. కూల్చిన షెడ్లను తన సొంత నిధులతో పునర్నిర్మిస్తామని జీరయ్యస్వామితో చెప్పారు మంత్రి నారా లోకేష్. ఈ మాట చెప్పిన 24గంటల్లో మంత్రి ఆదే శాలతో రంగంలోకి దిగిన బృందం కూల్చివేసిన షెడ్ల శిథిలాలను తొలగించింది. పునర్ నిర్మాణ పనులు ఆరంభించింది..



చైతన్యరథం

# అభివృద్ధిలో అగ్రగామిగా మంగళగిరి

- త్వరలోనే ఇళ్ల పట్టాల పంపిణీ
- ప్రముఖ దేవాలయాల తరహాలో లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ డీపీఆర్ సిద్ధం
- మంత్రి నారా లోకేష్ వెల్లడి
- మంగళగిరిలో శ్రీ సన్‌ఫ్లవర్ హ్యాండ్ లూమ్స్ షోరూమ్‌ను ప్రారంభించిన మంత్రి



మంగళగిరి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో మంగళగిరిని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మంగళగిరి పట్టణం వీజే కాలేజీ వద్ద బైపాస్ సర్వీస్ రోడ్డులో టీటీడీ బోర్డు పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ సన్‌ఫ్లవర్ హ్యాండ్ లూమ్స్ షోరూమ్‌ను మంత్రి లోకేష్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా షోరూమ్ వద్దకు చేరుకున్న మంత్రి లోకేష్‌కు కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం షోరూమ్‌ను రిబ్బన్ కట్ చేసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి చేనేత చీరను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, చెరువు, కొండ పోరంబోకు, రైల్వే భూముల్లో దశాబ్దాలుగా నివాసముంటున్న వారికి పట్టాల పంపిణీ కసరత్తు ప్రారంభమైందని చెప్పారు. మంగళగిరి ప్రజల దశాబ్దాల కల వంద పడకల ఆసుపత్రి. కార్పొరేట్ హాస్పిటళ్లకు దీటుగా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తాం. ఇప్పటికే డిజైన్లు ఖరారయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి డీపీఆర్ సిద్ధమైంది. మే నెల నుంచి పనులు ప్రారంభిస్తాం. ఏడాదిన్నరలో పూర్తి చేస్తాం. వాటర్ పైప్ లైన్, అండర్ గ్రౌండ్ గ్యాస్, పవర్‌తో పాటు పార్కులు, కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తాం. ఇప్పటికే ఎస్ఎల్ఎన్ పార్కు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రాజధాని అమరావతి నుంచి రోడ్ నెం. 13,15ను మంగళగిరికి అనుసంధానించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ప్రముఖ దేవాలయాల తరహాలో మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ,పద్మశాలీ వెల్ఫేర్అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానికిదేవి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.








### ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా

## ఐదుగురు ఏకగ్రీవం

**- ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటన**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఐదు స్థానాలకు మొత్తం ఐదు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం సాయంత్రంతో ముగిసింది.

దీంతో బరిలో ఉన్న కొణిదల నాగేంద్రబాబు (జనసేన), బీద రవిచంద్ర (టీడీపీ), బి.తిరుమల నాయుడు (టీడీపీ), కావలి గ్రీష్మ ప్రసాద్ (టీడీపీ), సోము వీర్రాజు (బీజేపీ) ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ఆర్.వనితా రాణి ప్రకటించారు. ఎన్నికైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

## ప్రసాదరెడ్డి పాపాల పుట్ట త్వరలో బద్దలు


**- విచారణకు ఆదేశించిన మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు**

**- వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్**



విశాఖపట్నం (చైతన్యరథం): గత ప్రభుత్వ హయాంలో వైసీపీ కార్యకర్త మాదిరిగా పనిచేసి ఆంధ్రా వర్సిటీని భ్రష్టు పట్టించిన మాజీ వీసీ ప్రసాదరెడ్డి పాపాల పుట్ట త్వరలో బద్దలు కాబోతుందని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ అన్నారు. ప్రసాదరెడ్డి అక్రమాలపై విజిలెన్స్‌విచారణకు ఆదేశించిన మంత్రి లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏయు ప్రతిష్టను మసక బార్చిన ప్రసాదరెడ్డి చట్టం ముందు దోషిగా నిలబడక తప్పదని అన్నారు. 60రోజుల వ్యవధిలో విచారణ పూర్తిచేసి నివేదిక సమర్పించాలని ఆదేశించడం మంత్రి లోకేష్ చిత్తశుద్ధిని చాటుతోందని అన్నారు. లోకేష్ సారథ్యంలో రాబోయే రోజుల్లో ఏయూకి గత వైభవం చేకూర గలదన్న ఆశాభావాన్ని ప్రణవ్ వ్యక్తం చేశారు.






### లక్ష్మీనరసింహస్వామికి పట్టువస్త్రాలు

# సమర్పించిన లోకేష్ దంపతులు


## అట్టహాసంగా మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం

మంగళగిరి (చైతన్య రథం): యుగయుగాల దేవుడు మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 12.00 గం.లకు నిర్వహించిన స్వామివారి కల్యాణమహోత్సవంలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామికి ప్రభుత్వం తరపున లోకేష్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా జరిగిన స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించి స్వామివారి అనుగ్రహం పొందారు. ఈ సందర్భంగా వేద పండితులు స్వామివార్లకు విష్వక్షణ ఆరాధన, పుణ్యాహవాచనం రక్షాబంధనం, మధుపర్క నివేదన, స్వామివారి పాదపక్షాలన, విశేష అర్చన, మహా సంకల్పం, ముత్యపు తలంబ్రాలు, బ్రహ్మముడి, మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. మంత్రి లోకేష్ దంపతుల రాకను పురస్కరించుకుని ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అంతకుముందు లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి చేరుకున్న మంత్రి లోకేష్ దంపతులకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు.













## ఏయూలో మాజీ వీసీ అవినీతిపై
# విజిలెన్స్ విచారణ

**- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు డిమాండ్**



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రా యూనివర్సిటీలో గతంలో జరిగిన అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని.. వెంటనే విజిలెన్స్ విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శాసనసభలో గురువారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. మాజీ వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి హయాంలో విశ్వవిద్యాలయంలో భారీగా అవకతవకలు జరిగాయని.. అక్రమ నియామకాలు, నిధుల దుర్వినియోగంతో పాటు.. విశ్వవిద్యాలయాన్ని రాజకీయాలకు అడ్డాగామార్చాని. రూ. 20 కోట్ల రూసా గ్రాంట్ దుర్వినియోగం చేయడం, ఇస్రో నుంచి వచ్చిన రూ. 25 లక్షల నిధులు గోల్‌మాల్ చేయడంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి పెట్టాలన్నారు. నాడు జగన్ విశాఖపట్నం వస్తే విద్యార్థుల తరగతులు ఆపి ఆయనకు స్వాగతం పలికేందుకు స్వయంగా వీసీనే విద్యార్థులను ప్రోత్సహించడం ఆయన బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట అన్నారు. ప్రైవేట్ కాలేజీల నుంచి లంచాలు తీసుకుని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షలు నిర్వహించడం, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా నాటి అధికార పార్టీకి మద్దతుగా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. విశ్వవిద్యాలయాన్ని పాలకుల స్వార్థ ప్రయోజనాలకు వాడుకునేలా చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించకూడ దన్నారు. ఈ సందర్భంగా దీనికి స్పందించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమాధానం ఇస్తూ.. ఇప్పటికే ఇన్‌ఛార్జి వీసీ కమిటీ వేసి నివేదిక అందించారని.. విజిలెన్స్ విచారణ పూర్తి అయిన వెంటనే దోషులను శిక్షిస్తామని.. అలాగే విశ్వవిద్యాలయ పురోభివృద్ధి కోసం విద్యా ప్రమాణాలను పెంచడం కోసం కట్టుబడి ఉన్నామన్నారు. ఏయూలో విద్యార్థులకు, బోధనాసిబ్బందికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చేసి... విద్యా నాణ్యతను పెంచి ఏయూ గౌరవాన్ని మరింత పెంచేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. మంత్రి లోకేష్ సమాధానంతో సంతోషం వ్యక్తం చేసిన పల్లా శ్రీనివాసరావు ఇదే మా ప్రభుత్వ ధ్యేయం అని స్పష్టం చేశారు.

## 2030 నాటికి మూడు వేల టన్నుల
# గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతే లక్ష్యం



- **మొదటగా విద్యుత్ సంస్కరణలు అమలు చేసింది టీడీపీనే**
- **రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్లతో రైతులకు లబ్ధి**
- **అసెంబ్లీలో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

అమరావతి (చైతన్యరథం): దేశంలో విద్యుత్ సంస్కరణలను మొదటిసారి అమలు చేసింది తెలుగుదేశం పార్టీనే అని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శాసనసభలో విద్యుత్ శాఖపై జరిగిన లఘు చర్చలో భాగంగా గురువారం మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. ఈ సందర్భంగా పలు విషయాలను సభ్యులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివరించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాతే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలను ప్రారంభమ య్యాయని వెల్లడించారు. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా ఈఆర్సీని తీసు కువచ్చింది కూడా ఏపీనే అని ఈ సందర్భంగా తెలిపారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్‌రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసు కుంటున్నామని పేర్కొన్నారు. 1.85 లక్షల కోట్ల పెట్టుబడితో అనకాపల్లి జిల్లా పూడిమడకలో 1,200 ఎకరాల్లో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టును ఎన్టీపీసీ, నెడ్ క్యాప్ భాగస్వామ్యంతో ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు. 2030 సంవత్సరం నాటికి మూడువేల టన్నుల గ్రీన్‌హైడ్రోజన్ ఉత్పత్తి,ఎగుమతి లక్ష్యం గా ముందుకు వెళ్తున్నట్లు మంత్రి వివరించారు. రిలయన్స్ సంస్థ రాష్ట్రంలో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్లను ఏర్పాటు చేస్తు న్నట్లు తెలిపారు. సీబీజీ ప్లాంట్ల నిర్మా ణంతో రాష్ట్రంలోని రైతులకు మరింత లబ్ధి చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. టాటా రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్‌తో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ఆ సంస్థ రూ.49వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 7000మెగావాట్ల పున రుత్పాదక విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాము. అదే విధంగా బ్యాటరీ స్టోరేజ్ సిస్టంను రాష్ట్రంలో తొలిసారి ప్రవేశపెడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. వినియోగదారు లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం 55సబ్ స్టేషన్లను రాష్ట్రవ్యాప్తంగా నిర్మి స్తున్నట్లు మంత్రి సభలో పేర్కొన్నారు.

**పెరుగుతున్న వినియోగానికి తగ్గట్టుగా ఉత్పత్తి**

రాష్ట్రంలో ఏటా 6శాతం విద్యుత్ వినియోగం పెరుగుతుందని, అందుకు అనుగుణంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న ట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. ఏపీ జెన్కో ద్వారా రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. తద్వారా విద్యుత్ కొనుగోళ్లను కూడా 60శాతానికి తగ్గించామని పేర్కొన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం వద్దని జగన్మోహన్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాస్తే... సూర్యఘర్ పథ కం ద్వారా మరిన్ని కనెక్షన్లు కావాలని ప్రధాన మంత్రికి లేఖ రాసిన ఘనత సీఎం చంద్రబాబుది అన్నారు. అదే విధంగా పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తు న్నామన్నారు. మొత్తం 4.5 లక్షల పీఎం కుసుమ్ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి గొట్టిపాటి వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో 9 సార్లు కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపారని ఆయన స్పష్టం చేశారు. జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం... లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఒక్క ఎకరాకూ.. చుక్క నీరు కూడా ఇవ్వలేదన్నారు. అదే విధంగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై జిల్లా ఎస్పీల తో చర్చించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయ స్తామని హామీఇచ్చారు. విద్యుత్ వ్యవస్థను సర్వ నాశనం చేసిన జగన్, వైసీపీ నేతలు ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేందు కు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖకు సంబంధించి సభ్యులు సభదృష్టికి తీసుకొచ్చిన అంశాల ను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటా మని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# వైకుంఠపురం బ్యారేజీ నిర్మిస్తాం

- **జగన్ నిర్వాకంతో రెట్టింపైన వ్యయం అంచనా**
- **అసెంబ్లీలో జలవనరుల మంత్రి నిమ్మల**



అమరావతి (చైతన్యరథం): బహుళ ప్రయోజనాలు ఉన్న వైకుంఠపురం బ్యారేజ్ నిర్మాణ బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ ప్రతిపాదిత బ్యారేజీ పూర్వాపరాలు స్పష్టంగా వివరించారు. 2050 నాటికి అమరావతిలో 35 లక్షలు జనాభా ఉంటుందని, అమరావతి, గుంటూరు, విజయవాడ నగరాలకు తాగునీరు సంపూర్ణంగా అందించవచ్చనే లక్ష్యంతో 2016లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం వైకుంఠపురం వద్ద కొత్త బ్యారేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. రూ.2169 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచి నవయుగ, వెంకట్రావు ఇన్ఫ్రా, నిర్మాణ సంస్థలకు 2018లో వర్క్ ఆర్డర్లు కూడా ఇచ్చామన్నారు.

దురదృష్టవశాత్తు, తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం రాజధాని విషయంలో మాట మార్చి మూడుముక్కలాటాడిందన్నారు. అందులో భాగంగా వైకుంఠపురం బ్యారేజ్ నిర్మాణాన్ని రద్దు చేసిందన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో వైకుంఠపురం బ్యారేజ్ ఆవశ్యకతను గుర్తించి రూ.4000 కోట్లు ఖర్చుతో కొత్త డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు.

జగన్ చేసిన పాపాల వల్ల వైకుంఠపురం బ్యారేజ్ నిర్మాణ వ్యయం గడిచిన ఐదేళ్లలో సుమారు రెట్టింపు అయిందన్నారు. గత ఏడాది కృష్ణా నదికి వచ్చిన 11.4 లక్షల క్యూసెక్కుల వరద ఉధృతిని దృష్టిలో పెట్టుకుని, కొత్త డీపీఆర్లో 15 లక్షల క్యూసెక్కులు వరద తాకిడిని తట్టుకునే విధంగా రూపొందించామన్నారు.

కృష్ణా నదిపై ఉన్న ప్రకాశం బ్యారేజ్– పులిచింతలకు మధ్య గుంటూరు జిల్లాలోని వైకుంఠపురం, కృష్ణాజిల్లాలోని దాములూరు మధ్య ప్రతిపాదించిన ఈ బ్యారేజ్ వల్ల తాగునీటి సమస్య తీరటంతోపాటు, అనేక లిఫ్టులకు సాగునీరు సమృద్ధిగా అందుతుందన్నారు. వరద ముంపునకు కూడా పరిష్కారం దొరుకుతుందన్నారు. అంతేకాక పర్యాటక రంగం, ఆక్వా కల్చర్ అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఇన్ని ప్రయోజనాలు ఉన్న వైకుంఠపురం బ్యారేజ్ నిర్మాణ బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని, ఇప్పటికే దీనిగురించిన ప్రతిపాదనలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

**'గుండ్రేవులపై' ప్రత్యేక శ్రద్ధ**

అత్యల్ప వర్షపాతంతో, దుర్భిక్షం తాండవిస్తున్న కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతాలకు సాగు, తాగునీరు, కర్నూలు నగరపాలక సంస్థకు తాగునీరు, కేసీ కెనాల్ ఆయకట్టు 2.65 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉద్దేశించిన గుండ్రేవుల ప్రాజెక్టును దశలవారీగా నిర్మిస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తికి సవరించిన అంచనాల ప్రకారం రూ.4530 కోట్లు వ్యయం కాగల కొత్త డీపీఆర్‌ను గత ఏడాది డిసెంబర్‌లో ప్రతిపాదించామన్నారు. గుండ్రేవుల రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణ విషయంలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సమ్మతి కూడా తీసుకోవలసి ఉందన్నారు.

ఈ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు, యువగళం పాదయాత్ర చేసి ఆ ప్రాంత ప్రజల కష్టాలను కళ్లారా చూసిన మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక శ్రద్ధ ఉందన్నారు. కర్నూలు పశ్చిమ ప్రాంతాలను ప్రత్యేక దృష్టితో చూడాల్సిన అవసరాన్ని మా అంతర్గత సమావేశాలలో అనేకసార్లు ప్రస్తావించారన్నారు.

ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేయగలిగితే కర్నూలు జిల్లాలోని వర్షాభావ ప్రాంతాలైన ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల్లో నీటి ఎద్దడి తీర్చవచ్చు అన్నారు. ఆ జిల్లా ఇన్చార్జి మంత్రిగా నాకు కూడా అక్కడ ప్రజల కష్టసుఖాలు పూర్తిగా తెలుసు అన్నారు. రాయలసీమ ముద్దుబిడ్డనని చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో గుండ్రేవుల వైపు కన్నెత్తి కూడా చూడలేదన్నారు. ఆయన పాపాలన్నీ మా పాలిట నేడు శాపాలుగా తయారయ్యాయని దుయ్యబట్టారు. ఒక ఇరిగేషన్ శాఖకే రూ.16 వేల కోట్ల రూపాయిలు బకాయిలు పెట్టి పోయారన్నారు. ఈ అప్పులు తీర్చుకోవడం తోపాటు ప్రతిపాదిత ప్రాజెక్టులు అన్నిటికీ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంలో నిధులు సమకూర్చుకొని దశల వారీగా పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల వివరించారు.

చైతన్యరథం



# అంగరంగ వైభవంగా శ్రీనివాస కళ్యాణం

- వెంకటపాలెం ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తి
- కళ్యాణం జరిగే ప్రాంతం సస్యశ్యామలం
- ఇది భక్తుల ప్రగాఢ విశ్వాసం..
- టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

అమరావతి (చైతన్య రథం): అమరావతి రాజధాని వెంకటపాలెం గ్రామంలోని శ్రీ వేంటేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో ఈనెల 15న శనివారం సాయంత్రం 6.30 నుండి 8.30వరకు నిర్వహించ నున్న శ్రీనివాస కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి అన్నిఏర్పాట్లు పూర్తిచేశామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు గురువారం ప్రకటించారు. రాజధాని వెంకటపాలెంలో ఉన్న శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఈవో జె.శ్యామలరావు, టీటీడీ బోర్డు సభ్యులతో కలిసి శ్రీనివాస కళ్యాణోత్సవం నిర్వహణపై బీఆర్ నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శ్రీనివాస కళ్యాణోత్సవం అనంతరం స్వామి వారి దివ్య ఆశీస్సులతో అమరావతి పనుల పునర్నిర్మాణానికి అంకురార్పణ చేస్తామన్నారు.మొదటి విడతగా దాదాపు రూ.37 వేల కోట్లతో పనులు ప్రారంభించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తైన నేపథ్యంలో శ్రీనివాస కళ్యాణోత్సవం జరగ నుండడం ఆనందంగా ఉందన్నారు. ఏ ప్రాంతంలో అయితే శ్రీనివాసకళ్యాణం జరుగుతుందో ఆ ప్రాంతం సస్యాశ్యామలం అవుతుందని భక్తుల నమ్మకమని నాయుడు పేర్కొన్నారు.

గురువారం ఉదయం అమరావతి రైతులతో, రైతు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. అమరావతి పునర్నిర్మాణంలో రాజధాని రైతులతోపాటు, ప్రజలు కూడా అంతేకాకుండా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నదే ముఖ్యమంత్రి ఆకాకంక్ష అన్నారు. శ్రీవారి కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్నిపొందాలని ఛైర్మన్‌కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు,రాజధాని రైతులు, వివిధ గ్రామాలు, ప్రాంతాలనుండి ప్రజలు పెద్దఎత్తున పాల్గొంటారని తెలిపారు.

టిటిడి ఈవో జె.శ్యామలరావు మాట్లాడుతూ శ్రీనివాస కళ్యాణానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ,జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు.



టీటీడీ చేపట్టిన ఏర్పాట్లను ఈవో జె శ్యామలరావు మీడియాకు వివరిస్తూ....

**శ్రీవారి ఆలయం:** శ్రీనివాస కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తిరుమలనుంచి అర్చక స్వాములు, వేద పండితులు, వారితోపాటు మంగళ ధ్వని, అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు విచ్చేస్తున్నారు.

**ఇంజనీరింగ్:** కళ్యాణ వేదిక నిర్మాణంతోపాటు 27 వేల మంది భక్తులు కళ్యాణాన్ని తిలకించేందుకు వీలుగా సదుపాయాలు కల్పిస్తున్నాం. గుంటూరు, విజయవాడ తదితర ముఖ్యమైన ప్రాంతాలలో ఫ్లెక్సీ బోర్డులు, హోర్డింగులు ఏర్పాటు చేశాం.

**ఎలక్ట్రికల్ విభాగం:** శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంతోపాటు, కళ్యాణ వేదిక పరిసర ప్రాంతాలలో విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటుచేశాం. వేదిక చుట్టూ భక్తులు కళ్యాణాన్ని తిలకించేందుకు ఎల్ఈడి టీవీలు ఏర్పాటు చేశాం. నిరంతరాయంగా జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నాం.

**సెక్యూరిటీ:** టీటీడీ నిఘా మరియు భద్రతా విభాగం నుంచి 160మంది, గుంటూరు జిల్లా పోలీస్ యంత్రాంగం నుండి 600 మందితో పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేస్తున్నాం. పోలీస్ డిపార్ట్‌మెంట్ సహకారంతో 5 డ్రోన్లు, 70 సీసీ కెమెరాలు భద్రత, పర్యవేక్షణకు ఏర్పాటు చేశాం. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నాం.

**పార్కింగ్:** ఆలయం వెనుక వివిఐపీల కొరకు 400 వాహనాలకు, ఆలయం కాంపౌండ్ వాల్ వెనుక 1000 వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాం. అదేవిధంగా సీడ్ యాక్సిస్ రోడ్డు దక్షిణంవైపు 1500 వాహనాలకు పార్కింగ్ స్థలం కేటాయించాం.

**అన్నప్రసాదాలు:** శ్రీనివాస కళ్యాణంలో పాల్గొనే భక్తులందరికీ శ్రీవారి సేవకుల సహకారంతో మంచి నీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేశాం.

**ప్రజా సంబంధాలు/ ఎస్వీబీసీ:** హెచ్‌డీపీపీ ప్రచార రథాల ద్వారా శ్రీవారి ఆలయం సమీపంలోని 27 గ్రామాలలో ఇంటింటికి కరపత్రాలు, వాల్ పోస్టర్లు పంపడం జరిగింది.

శ్రీనివాస కళ్యాణాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. మీడియా వారికి లైవ్ ఫ్రీక్వెన్సీ లోగో లేకుండా ఇస్తాం. టీటీడీ పిఆర్ విభాగం మరియు జిల్లా ఐ అండ్ పిఆర్ విభాగం ద్వారా పత్రికా ప్రకటనలు, ఫోటోలు మీడియాకు పంపిస్తాం.

**శానిటేషన్:** శ్రీవారి ఆలయంతోపాటు కళ్యాణ వేదిక, పరిసరాలు మరియు పార్కింగ్ స్థలాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచడానికి వందమంది పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేశాం. అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం కల్యాణ వేదిక పరిసరాలలో దాదాపు వంద మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం.

**వైద్య విభాగం:** ఆలయ పరిసరాలలో ప్రత్యేకంగా రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ వైద్య శిబిరాలలో తగినంత డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బందితోపాటు రెండు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుతున్నాం.

**రవాణా:** వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఏపీఎస్ఆర్టీసీ సహకారంతో 300 బస్సులతో రవాణా సౌకర్యం కల్పిస్తున్నాం.

**గార్డెన్ విభాగం:** వివిధ రకాల సాంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్‌తో స్వామివారి ఆలయంతో పాటు కళ్యాణ వేదికను శోభాయమానంగా తీర్చిదిద్దుతాం.

**హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు:** హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు చెన్నైకి చెందిన ప్రముఖ కళాకారిణి శ్రీమతి నిత్యశ్రీ మహాదేవన్‌తో శ్రీనివాస సంకీర్తనం. సాయంత్రం 5 గంటలనుండి 6.15 గంటల వరకు చెన్నైకి చెందిన ప్రియా సిస్టర్స్ బృందం అన్నమాచార్య సంకీర్తనలు. సాయంత్రం 6.20 గంటలకు ప్రముఖ భగవద్గీత ఉపన్యాసకులు గంగాధర శాస్త్రితో టీటీడీ ధార్మిక, ఆధ్యాత్మిక ఉపన్యాసం. సాయంత్రం 6.30 నుండి 8.30వరకు నిర్వహించే శ్రీనివాస కళ్యాణం వ్యాఖ్యాతగా సరస్వతీ పుత్రులు, సహస్ర అవధాని డాక్టర్ మేడసాని మోహన్ వ్యవహరిస్తారు.

కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, ఎం.శాంతారామ్, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సిఈ సత్యనారాయణ, సీపీఆర్‌వో టి.రవి పాల్గొన్నారు.

## ఏర్పాట్లను పరిశీలించిన మంత్రుల బృందం

సీఆర్డీఏ పరిధిలోని టీటీడీ ఎస్వీ ఆలయంలో మార్చి15న జరుగనున్న శ్రీనివాస కళ్యాణోత్సవం ఏర్పాట్లను గురువారం సాయంత్రం రాష్ట్ర మంత్రుల బృందం పరిశీలించింది. భక్తుల రద్దీకి తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని తితిదేకు సూచించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్లు, ట్రాఫిక్, పార్కింగ్, లైటింగ్, అలంకరణలు, అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదం, త్రాగునీరు, మజ్జిగ, పారిశుద్ధ్య తదితర పనులు సకాలంలో పూర్తి చేయాలని మంత్రులు సూచించారు. కల్యాణ వేదిక ప్రాంగణాన్ని మంత్రుల బృందం దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంమంత్రివి అనిత, రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రి పి.నారాయణ, తితిదే బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, ఎం.శాంతారామ్, ఎం.ఎస్.రాజు, డిఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్యచౌదరి, దేవాదాయ కార్యదర్శి వినయ్ చంద్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జేఈవో వి వీరబ్రహ్మం, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు పరిశీలించారు.





# చంపుతామంటూ ఏఎస్ఐ బెదిరింపులు

- గ్రీవెన్స్‌లో బాధిత మహిళ ఫిర్యాదు
- అక్రమ టీడీఆర్ బాండ్లు రద్దు చేసి న్యాయం చేయాలని తాడేపల్లిగూడెం వాసుల విజ్ఞప్తి
- పలు భూ సమస్యలపై నేతలకు వినతులు అందించిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్



అమరావతి (చైతన్యరథం): అధికారులు సర్వే చేసి పాతిన రాళ్లు పీకేయడమే కాకుండా అక్రమంగా తమ స్థలంలో కంచె పాతి తమపైనే దౌర్జన్యానికి వస్తున్న నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, నారపురెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, నారపురెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, నిమ్మకాయల ప్రసాద్ రెడ్డిలపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కడప జిల్లా సిద్దవటం మండలం కె.ఉక్కాయపల్లె గ్రామానికి చెందిన బత్తల పాలకొండమ్మ టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో నేతలు హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌లకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

కడప డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా ఉంటూ.. తన కింద ఆఫీసులో ఎంవీఐగా పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని వేధించి సస్పెండ్ అయిన ఏ. చంద్రశేఖర్ రెడ్డి విచారణకు హాజరు కాకపోవడమే కాక.. ఉద్యోగులను బెదిరిస్తున్నాడని.. తాను వైవీ సుబ్బారెడ్డి అనుచరుడినని.. విజయసాయిరెడ్డి తన బంధువని చెప్పుకుంటూ భయపెడుతున్నాడని.. అతని అవినీతి అక్రమాలు, బినామీ ఆస్తులపై విచారణ జరిపి అతన్ని సర్వీస్ నుండి డిస్మిస్ చేయాలని టీడీపీ నాయకులు బి.హరిప్రసాద్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

కర్నూలు నగరానికి చెందిన పి.రామాదేవి విజ్ఞప్తి చేస్తూ.. బస్సులో జరిగిన పిల్లల గొడవపై తమ ఇంటిమీదకు వచ్చి దాడి చేయడమే కాకుండా దారుణంగా తిట్టారని.. ఏఎస్ఐ వీర్రన్న తమను కొట్టడమే కాకుండా కాళ్లతో తన్నుతూ.. చంపేస్తామని బెదిరించాడని అతను, తమపై దాడి చేసిన వారిమీద చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి వేడుకున్నారు.

పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామానికి చెందిన నలబోతు వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేస్తూ.. తాను కొనుగోలు చేసిన భూమిని గొబ్బూరు ఆంజనేయులు అనే వ్యక్తి కబ్జా చేసి ఆక్రమించుకున్నాడని, అతని నుండి తమ భూమిని విడిపించాలని అధికారులకు ఎన్నీ సార్లు అర్జీ పెట్టుకున్నా పట్టించుకోవడలేదని.. దయ చేసి తమ భూమిని కబ్జా నుండి విడిపించాని వేడుకున్నారు.

చిత్తూరు జిల్లా సోమల మండలానికి చెందిన రాశెట్టి సుందరయ్య విజ్ఞప్తి చేస్తూ.. గత టీడీపీ ప్రభుత్వంలో తనకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని వైసీపీ ప్రభుత్వంలో అన్యాయంగా రద్దు చేశారని.. దీనిపై కలెక్టర్‌కు అర్జీ పెట్టుకోగా పరిశీలించి న్యాయం చేయాలని కింది స్థాయి అధికారులకు పంపిస్తే.. వారు పట్టించుకోవడంలేదని వాపోయారు.

గత ప్రభుత్వంలో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో అక్రమంగా జారీ చేసిన టీడీపీఆర్ బాండ్లను రద్దు చేసి తమ పేరున కొత్త టీడీఆర్ బాండ్లను రద్దు చేయాలని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం 18వ వార్డుకు చెందిన వెలగల పార్వతి, గుడిమెట్ల హిమబిందు, చింతా శ్రీలత విజ్ఞప్తి చేశారు.









## ఓబులాపురం వద్ద ఆందోళనల ఘటన

# టీడీపీ నేతలపై కేసు కొట్టివేత

విజయవాడ: అనంతపురం జిల్లాలో ఓబులాపురం గనుల వద్ద గతంలో టీడీపీ నేతల ఆందోళనలపై నమోదైన కేసులను ప్రజాప్రతినిధుల కోర్టు కొట్టివేసింది. విచారణలో భాగంగా గురువారం పలువురు నేతలు విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. కోర్టుకు వచ్చిన వారిలో మంత్రి అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, చినరాజప్ప, ఎర్రబెల్లి దయాకర్‌రావు, నాగం జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, తదితరులున్నారు. 2007లో వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో టీడీపీ నేతలు ఓబులాపురం గనుల పరిశీలనకు వెళ్లారు. దీనిపై అప్పట్లో కేసులు నమోదయ్యాయి. గత కొన్నేళ్లుగా టీడీపీ నేతలు విచారణకు హాజరవుతుండగా.. కేసు కొట్టివేతతో విముక్తి లబించింది.



## భూములివ్వకుంటే చంపేస్తామని వైసీపీ నేతలు బెదిరించారు



విశాఖపట్నం (చైతన్యరథం): హయగ్రీవ ఫార్మ్ అండ్ డెవలపర్స్ సంస్థకు ఇచ్చిన భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. గతంలో ఈ ఫార్మా సంస్థకు 12.41 ఎకరాల భూమిని కేటాయించారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు రుజువు కావడంతో ప్రభుత్వం ఆ భూకేటాయింపును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు సీసీఎల్ఏ ఉత్తర్వులు జారీ చేసింది. భూమిని స్వాధీనం చేసుకుని ఆ ప్రదేశంలో ఆ భూమి ప్రభుత్వ భూమిగా కలెక్టర్ బోర్డులు పెట్టారు. హయగ్రీవ భూముల కోసం గత పాలకులు బెదిరించారని హయగ్రీవ ఫార్మ్స్ ఎండీ జగదీశ్వరుడు తెలిపారు. వైసీపీ మాజీ ఎంపీ ఎంవీవీ, ఆడిటర్ జీవీ తన భూములు లాక్కున్నారని వాపోయారు. ఈ భూముల కోసం వైసీపీ నేతలు బెదిరించారని, భూములు ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరించినట్లు తెలిపారు. బినామీలతో హయగ్రీవ భూములు లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూముల కోసం పథకం ప్రకారమే బ్రహ్మాజీని కంపెనీలోకి పంపించారని వెల్లడించారు. వారి బెదిరింపులు తాళలేక కంపెనీలో బ్రహ్మాజీని భాగస్వామిని చేసినట్లు తెలిపారు. భూములతో స్థిరాస్తి వ్యాపారం జరిగిందని ఈడీ విచారణలో తేలిందని అన్నారు. హయగ్రీవ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటం సరైందేనని జగదీశ్వరుడు తెలిపారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి

- జీసీసీ గోడౌన్స్‌ని తనిఖీ చేసిన చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



అరకు (చైతన్యరథం): అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండల కేంద్రంలో రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు జీసీసీ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం జీసీసీ గ్యాస్ గోడౌన్ జీసీసీ డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉండాలని గత వైసీపీ ప్రభుత్వం జీసీసీని నిర్వీర్యం చేసిందని కనీసం జీసీసీ డిపో శిదిలా వ్యవస్థలో ఉన్నా కనీసం పట్టించుకో లేదని కానీ ప్రతి ఒక్కరు రికార్డులను సక్రమంగా రికార్డ్ చేయాల్సిన బాధ్యత ఉందని నిత్యావసర సరుకులు సమయానికి అందేలా చూడాలని శ్రావణ్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శికరి సుకుమారి వైస్ ఎంపీపీ పాంగి సోనే,దన్ను మాజీ వైస్ ఎంపీపీ వెచ్చంగి కొండయ్య,మాజీ సర్పంచ్ త్రినాధ్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, టీడీపీ డివిజన్ నాయకుడు దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, సీతగుంట ఎంపీటీసీ బొంజుబాబు,అరకు పార్లమెంట్ అధ్యక్షులు అండిభ సర్పంచ్ తామర్ల సత్యనారాయణ, శోభకోట సర్పంచ్ పలాసి శశి భూషణం నాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు లొట్టి చిన్ని, అరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శికరి వెంకటేష్ అరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నరంజి ప్రసాద్, అరకు అసెంబ్లీ తెలుగు యువత ఆర్గనైజషన్ సెక్రటరీ కర్రా అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్‌తోనే యువత భవిత సాధ్యం : వెంకటరమణ



శ్రీకాకుళం (చైతన్యరథం): యువత భవితను దెబ్బతీసింది వైఎస్ జగనే అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ విమర్శించారు. యువత భవిత లోకేష్‌తోనే సాధ్యమని తెలిపారు. బుధవారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏకంగా రూ.4,271 కోట్లు ఫీజు, వసతి దీవెన బకాయిలు పెట్టేశారన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. కానీ జగన్ తొమ్మిది లక్షల మందికి కుదించేసి ఏడు లక్షల మంది విద్యార్థులకు అన్యాయం చేశారని ఆరోపించారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ, ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ హామీపై జగన్ మాట తప్పారన్నారు. కమీషన్ల కోసం పరిశ్రమలపై దాడులు చేసి జగన్ ప్రభుత్వం పెట్టుబడుల్ని పొరుగు రాష్ట్రాలకు తరిమేసి నిరుద్యోగం పెంచిందని చెప్పారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, బి.భాస్కరరావు పాల్గొన్నారు.

## త్వరలో ప్రసాదరెడ్డి పాపాల పుట్ట బద్దలు కాబోతోంది



విశాఖపట్నం (చైతన్యరథం): గత ప్రభుత్వ హయాంలో వైసీపీ కార్యకర్త మాదిరిగా పనిచేసి ఆంధ్రా వర్సిటీని భ్రష్టు పట్టించిన మాజీ విసి ప్రసాద రెడ్డి పాపాల పుట్ట త్వరలో బద్దలు కాబోతుందని ఏపీఎంఆర్ డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అన్నారు. ప్రసాద రెడ్డి అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించిన మంత్రి లోకేష్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏయు ప్రతిష్టను మసక బార్చిన ప్రసాద రెడ్డి చట్టం ముందు దోషిగా నిలబడక తప్పదని అన్నారు. 60రోజుల వ్యవధిలో విచారణ పూర్తిచేసి నివేదిక సమర్పించాలని ఆదేశించడం మంత్రి లోకేష్ చిత్తశుద్ధిని చాటుతోందని అన్నారు. లోకేష్ సారథ్యంలో రాబోయే రోజుల్లో ఏయుకి గత వైభవం చేకూరగలదన్న ఆశాభావాన్ని ప్రణవ్ వ్యక్తం చేశారు.

## రాష్ట్ర పండుగగా నూకాంబిక అమ్మవారి జాతర



అనకాపల్లి (చైతన్యరథం): స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కూటమి నాయకులు ఆనందోత్సవాలు నిర్వహించారు. కూటమి అధికారంలోకి వస్తే నూకాంబిక అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా నిర్వహించేలా కృషి చేస్తానని గత ఏడాది ఎన్నికల ముందు జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందించారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సాయంత్రం కూటమి పార్టీల నాయకులు ఆలయ ఆవరణలో మిఠాయిలు పంచి బాణసంచా వెలిగించారు. జీవో కాపీలకు అమ్మవారి బాలాలయంలో పూజలు నిర్వహించారు. పంచలోహ ఉత్సవ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో ఎన్.సుజాత, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కె. శోభారాణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అదనంగా ధాన్యం కొనుగోలు : ఎమ్మెల్యే కూన



ఆముదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతుల నుంచి ప్రభుత్వం అదనంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఖరీఫ్‌లో సాగు చేసిన రైతులు ఇటీవల రైతు సేవాకేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించినా, ఇంకా ధాన్యం నిల్వలు ఉన్నట్లు రైతులు తనకు పలువురు తెలియజేశారని పేర్కొన్నారు. ఈ సమస్యపై ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు సంబంధితమంత్రులకు తెలియజేసినట్లు చెప్పారు. దీంతో నియోజకవర్గంలో అదనంగా రైతుల నుంచి లక్ష క్వింటాళ్ల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతిఇచ్చి నట్లు తెలిపారు. పొందూరు మండలంలో 35 వేలు, ఆముదాలవలస, బూర్జ మండలాల్లో 25 వేలు క్వింటాళ్లు చొప్పున, బూర్జ మండలంలో 25 క్వింటాళ్లు చొప్పున, సరుబుజ్జిలి మండలంలో 15 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

## మార్చి 17 నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పరీక్షలు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పదో తరగతి విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభంకానున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవ్వరి వద్ద మొబైల్ ఫోన్ ఉండేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎవరైనా ఫోన్లు తీసుకువస్తే వాటిని గేటువద్దే సేకరించి భద్రపరచాలని సూచించారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై మార్చి 12న ఆయన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అలాగే పరీక్షల నిర్వహణ సమయంలో పేపర్ లీక్‌లకు సంబంధించి తప్పుడు వార్తలు సోషల్ మీడియాలో ఎవరైనా వ్యాప్తి చేస్తే.. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమలు చేయాలని విజయానంద్ ఆదేశించారు. మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించనున్న పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 6,19,275 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 3,15,697 మంది, బాలికలు 3,03,578 మంది వరకు ఉన్నారు. మొత్తం 3,450 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. సమస్యాత్మక కేంద్రాలు 163 వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయనున్నారు. పరీక్షలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు తలెత్తితే హెల్ప్‌లైన్ నంబర్ 0866 2974540కు ఫోన్ చేయాలని సూచించారు. మరోవైపు సార్వత్రిక విద్యాపీఠం పదో తరగతి అభ్యర్థులకు కూడా రెగ్యులర్ వారితోనే కలిపి పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు మార్చి 17 నుంచి 28 వరకు జరగనున్నాయి. మొత్తం 30,344 మంది సార్వత్రిక విద్యాపీఠం పదో తరగతి విద్యార్థులు హాజరు కానున్నారు. కాగా ఇప్పటికే పదో తరగతి పరీక్షల హాల్ టికెట్లను విద్యాశాఖ జారీ చేసిన సంగతి తెలిసిందే. వాట్సప్ ద్వారా కూడా వీటిని పొందే సదుపాయం ప్రభుత్వం కల్పించింది.

# వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణ బాధ్యత చేపడతాం



పాలకొల్లు (చైతన్యరథం): బహుళ ప్రయోజనాలు ఉన్న వైకుంఠపురం బ్యారేజ్ నిర్మాణ బాధ్యతను కూటమి ప్రభుత్వం చేపడుతుందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ ప్రతిపాదిత బ్యారేజీ పుట్టుపూర్వోత్తరాలు స్పష్టంగా వివరించారు. 2050 నాటికి అమరావతిలో 35 లక్షలు జనాభా ఉంటుందని, అమరావతి, గుంటూరు, విజయవాడ నగరాలకు తాగునీరు సంపూర్ణంగా అందించవచ్చనే లక్ష్యంతో 2016లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం వైకుంఠపురం వద్ద కొత్త బ్యారేజ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. రూ.2,169 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచి నవయుగ, వెంకట్రావు ఇన్ఫ్రా, నిర్మాణ సంస్థలకు 2018లో వర్క్ ఆర్డర్లు ఇవ్వటం కూడా జరిగిందన్నారు. దురదృష్టవశాత్తు, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాజధాని విషయంలో మాట మార్చి మూడుముక్కలాటాడిందన్నారు. అందులో భాగంగా వైకుంఠపురం బ్యారేజ్ నిర్మాణాన్ని రద్దు చేసిందన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో వైకుంఠపురం బ్యారేజ్ ఆవశ్యకతను గుర్తించి రూ.4,000 కోట్లు ఖర్చు కాగల కొత్త డిపిఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు. జగన్ చేసిన పాపాల వల్ల వైకుంఠపురం బ్యారేజ్ నిర్మాణ వ్యయం గడిచిన ఐదేళ్లలో సుమారు రెట్టింపు అయిపోయిందన్నారు. గతేడాది కృష్ణా నదికి వచ్చిన 11.4 లక్షల క్యూసెక్కుల వరద ఉధృతిని దృష్టిలో పెట్టుకుని, కొత్త డిపిఆర్‌లో 15 లక్షల క్యూసెక్కులు వరద తాకిడిని తట్టుకునే విధంగా రూపొందించామన్నారు. కృష్ణా నదిపై ఉన్న ప్రకాశం బ్యారేజ్–పులిచింతలకు మధ్య గుంటూరు జిల్లాలను వైకుంఠపురం కృష్ణాజిల్లాలోని దాములూరు మధ్య ప్రతిపాదించిన ఈ బ్యారేజ్ వల్ల తాగునీరు, అనేక లిఫ్టులకు సాగునీరు సమృద్ధిగా అందుతుందన్నారు. వరద ముంపునకు కూడా పరిష్కారం దొరుకుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

**'గుండ్రేవులపై' ప్రత్యేక శ్రద్ధ**

అత్యల్ప వర్షపాతంతో, దుర్భిక్షం తాండవిస్తున్న కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతాలకు సాగు, తాగునీరు, కర్నూలు నగరపాలక సంస్థకు తాగునీరు, కేసీ కెనాల్ ఆయకట్టు 2.65 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉద్దేశించిన గుండ్రేవుల ప్రాజెక్టును దశలవారీ నిర్మిస్తామని నిమ్మల రామానాయుడు గురువారం నాటి అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తికి సవరించిన అంచనాల ప్రకారం రూ.4530 కోట్ల వ్యయం కాగల కొత్త డీపీఆర్‌ను 24 డిసెంబర్ నెలలో ప్రతిపాదించామన్నారు.

# పేదల పాలిట సీఎంఆర్ఎఫ్ ఓవరం




కాకినాడ (చైతన్యరథం): స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, కాకినాడ జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ 27మందికి సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ, వైద్యానికి ఆర్థికస్తోమత లేని బాధితులు సాయం కోసం అర్థించగా, స్థానిక ఎమ్మెల్యే, జ్యోతుల నెహ్రూ సిఫార్సులతో వారికి ముఖ్యమంత్రి సహాయనిధి సాయం మంజూరైంది. ఆరు నెలల కూటమి ప్రభుత్వం కాలంలో నియోజకవర్గంలోని అనేక మందికి సీఎం సహాయనిధి ద్వారా చెక్కుల మంజూరులో జ్యోతుల నెహ్రూ కృషి చేశారని నవీన్ అన్నారు. ఈ మేరకు జగ్గంపేట నియోజకవర్గంలోని జగ్గంపేట, గండేపల్లి, గోకవరం, కిర్లంపూడి మండలాలకు సంబంధించి 27 మందికి 25,22,204 రూపాయలు చెక్కులను బాధితులకు అందించారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ... ఆరోగ్యం దేశాభివృద్ధికి మూలమని, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి సాయం ఆశాజ్యోతి కావాలని ఆకాంక్షించారు. ప్రతిఒక్కరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, వీరం రెడ్డి, కాశిబాబు, ఉంగరాల రాము, నీలం శ్రీను, దేవరపల్లి మూర్తి, రేఖ బుల్లి రాజు, వేములకొండ జోగారావు, బద్ది సురేష్, కోడూరి సత్యనారాయణ, కాకర్ల కృష్ణాజి, ముత్యాల సత్యనారాయణ, సూరిశెట్టి వెంకట శివ, బీసెట్టి సూరిబాబు, కాకిలేటి రాయుడు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు సమీపంలో రోడ్డు ప్రమాదం

ఏలూరు (చైతన్యరథం): జిల్లా కేంద్రం ఏలూరు సమీపంలో బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగి 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. కాకి నాడ నుంచి గుంటూరుకు మంగళవారం అర్ధ రాత్రి ఆర్టీసీ బస్సు బయలుదేరింది. బుధవారం తెల్లవారు జామున 4.30 గంటల ప్రాంతంలో ఏలూరు మెయిన్ బైపాస్ రామచంద్ర ఇంజనీ రింగ్ కాలేజీ వద్ద ఆయిల్ డబ్బాల లారీని వెనుక నుంచి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో 12 మందికి గాయాలయ్యాయి. వారిలో నలు గురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ముగ్గురికి పళ్లు ఊడిపోయాయి. ప్రమాద సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ఏలూరు 108 అంబులెన్సు సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# పగో జిల్లాను పట్టిపీడిస్తున్న మధుమేహం




ఏపీలో ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి సర్కార్ చర్యలు చేపట్టింది. ఎన్‌సీడీ– 3.0 పేరిట వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అసంక్రమిక వ్యాధుల గుర్తింపు సర్వే చేపట్టింది. దీనిలో భాగంగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి 18 సంవత్సరాలు నిండిన వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుని వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు నమోదైన వివరాల ఆధారంగా పశ్చిమ గోదావరి జిల్లాలో మధుమేహ వ్యాధి అనుమానిత లక్షణాల ఉన్నవారి సంఖ్య (8.8 శాతం) ఎక్కువగా ఉంది. తరువాత స్థానంలో రక్తపోటు బాధితులు ఎక్కువగా ఉన్నారు.

చాపకింద నీరులా : ఈ సర్వేలో క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ప్రాథమిక పరీక్షల కోసం ఆసుపత్రులకు పంపుతున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం నోటి క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నవారి సంఖ్య ఎక్కువగా ఉంది. తర్వాతి స్థానంలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అనుమానిత కేసులు ఉన్నాయి. సర్వే కోసం ఇంటికి వచ్చిన వైద్య సిబ్బంది అడిగిన వివరాలు చెప్పేందుకు కొందరు వెనుకాడుతున్నారు. దీంతో వివరాలు పూర్తిస్థాయిలో రాబట్టలేక సర్వే వేగంగా సాగడంలేదు. గత సంవత్సరం నవంబర్ 14న సర్వే ప్రారంభించగా జిల్లాలో ఈ నెల 3వరకు 30.18 శాతం మాత్రమే పూర్తయింది. వీరిలో వివిధ రుగ్మతలతో ఉన్న అనుమానితులను వైద్యులు నిర్ధారించారు. వారికి వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. షుగర్, బీపీ బారిన పడిన వారితో పాటు రొమ్ము, గర్భాశయ, వివిధ రకాల క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిని వైద్యులు గుర్తించారు. ఇంటింటికీ వెళ్లి చేస్తున్న పరీక్షల్లో రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలు కచ్చితంగా ఉంటున్నాయి. వీటిలో ఏవైనా వ్యాధి లక్షణాలు తేలితే బాధితులకు సమీప ఆసుపత్రుల్లో వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లాలో సకాలంలో సర్వే పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని ఎన్‌సీడీ కార్యక్రమ పర్యవేక్షకులు డాక్టర్ ధనలక్ష్మి పేర్కొన్నారు.

# ఉమ్మడి జిల్లా పరిషత్ రూ.886 కోట్ల బడ్జెట్‌కు ప్రభుత్వ ఆమోదం

తూర్పుగోదావరి (చైతన్యరథం): రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లా పరిషత్‌లకు సంబంధించి ఆయా జిల్లా పరిషత్‌ల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ 2024–25 బడ్జెట్ అంచనాలను రూ.886 కోట్ల మేరకు ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ వివరాలిలా ఉన్నాయి. 2022–23లో వాస్తవ రాబడి రూ.44.37 లక్షలు ఉండగా, వాస్తవ వ్యయం రూ.54.47 లక్షలుగా ఉంది. 20 23–24 సవరించిన అంచనాలైతే రాబడిగా రూ.883 కోట్లు కాగా, వ్యయాన్ని రూ.882 కోట్లుగా చూపారు. ఇక 2024–25 బడ్జెట్ అంచనాలకు సంబంధించి రాబడిని రూ.886 కోట్లుగా చూపితే, వ్యయాన్ని కూడా రూ.886 కోట్లుగా చూపి అంచనా ప్రతిపాదనలను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి ప్రభుత్వానికి పంపించగా పలు షరతులతో ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది.

# అధికారుల నిర్లక్ష్యానికి రైతు వెంకట్రావు మృతి



దేవరపల్లి (చైతన్యరథం): అధికారుల నిర్లక్ష్యానికి ఓ రైతు బలయ్యాడు. తమ పొలానికి సంబంధించి ఆన్‌లైన్‌లో తప్పు పేరు రావడంతో మార్చుకోసం తిరుగుతూ తహశీల్దార్ కార్యాలయం వద్దే గుండెపోటుకు గురై మరణించాడు. కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం.. దేవరపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దెయ్యాల వెంకట్రావు (44) తన అత్త పాటెమ్మ వాటా కు రావాల్సిన 60 సెంట్ల భూమిని అత్త మేనల్లుడు అయిన పోలిమాటి రమేష్ పేరుపై ఆన్‌లైన్‌లోకి ఎక్కించడంతో 20 రోజులుగా ఆ పేరు మార్పు కోసం గ్రామ సర్వేయర్ దుర్గారావు చుట్టూ తిరుగుతున్నారు. బుధవారం సాయంత్రం సర్వేయర్ దుర్గారావు మృతుడు వెంకట్రావుకు తహశీల్దార్ కార్యాలయానికి రావాలని తెలియజేయడంతో వెంకట్రావు తన భార్య రత్నకుమారిని తీసుకుని తహశీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. తన అత్త పాటెమ్మ పేరుమీద ఉన్న 60 సెంట్లు భూమిని తన అత్త పేరు మీద ఆన్‌లైన్ చేయాలని అధికారులను కోరాడు. ఈ క్రమంలో గ్రామ సర్వేయర్ దుర్గారావు, మండల సర్వేయర్ డిల్లేశ్వరరావులకు రైతుకి మధ్య వాగ్వాదం జరిగింది. వెంకట్రావు ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆటోలో మృతదేహాన్ని తహశీల్దార్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చి మృతుని బంధువులు ఆందోళన చేపట్టారు. మృతుని భార్య రత్నకుమారి విలపిస్తూ తన భర్త మృతికి కారణం రెవెన్యూ అధికారులేనని ఆరోపించారు. మృతుని భార్య ఫిర్యాదుమేరకు ఎస్ఐ వి.సుబ్రహ్మ ణ్యం అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# నేడు జనసేన 12వ ఆవిర్భావ సభ - తరలివస్తున్న జనశ్రేణులు



పిఠాపురం (చైతన్యరథం): జనసేన 12వ ఆవిర్భావ సభకు కాకినాడ జిల్లాలోని పిఠాపురం నియోజకవర్గ ముస్తాబయింది. చిత్రాడ గ్రామంలో జాతీయ రహదారి పక్కనే 50 ఎకరాల సువిశాలమైన ప్రాంగణంలో ఆవిర్భావ సభకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, అభిమానులు లక్షల సంఖ్యలో తరలివచ్చేలా ఈ బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు. వేదికపై అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో పాటు 250 మంది వరకు ఆసీనులయ్యేలా వేదిక సిద్ధం చేశారు. రావు సూర్యారావు బహుదూర్ మహారాజ్, డొక్కా సీతమ్మ, మల్లాడి సత్యలింగ నాయకర్ పేర్లను మూడు ద్వారాలకు పెట్టారు. తెలుగు సంస్కృతి చరిత్ర అద్దం పట్టేలా సభ నిర్వహిస్తామని ఇప్పటికే జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. పిఠాపురం ప్రజలకు కృతజ్ఞత, ఎన్నికల్లో ఘన విజయం సాధించిన జనసేన భవిష్యత్తులో వ్యవహరించాల్సిన తీరుతెన్నులపై సభలో చర్చిస్తామని స్పష్టం చేశారు. లక్షల సంఖ్యలో తరలివచ్చే ఈ జనసేన ఆవిర్భావ సభకు 1500కు పైగా పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు.

## రాజధాని ప్రాంతానికి డిఫెన్స్ ఏరోస్పేస్ ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు

**● ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులతో విజయవాడ ఎంపీ కేశినేని సమావేశం**



విజయవాడ (చైతన్యరథం): "రాజధాని ప్రాంతమైన విజయవాడ ప్రాంతంలో డిఫెన్స్ ఏరోస్పేస్ ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు రానున్నాయి. ఇంకా ఈ ప్రాంత పారిశ్రామికాభివృద్ధికి ఎలాంటి వ్యూహం అనుసరించాలి. ఎటువంటి పరిశ్రమల ఏర్పాటుతో త్వరగా పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందనే అంశంపై త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌లను కలిసి చర్చిస్తాం." అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. రాబోయే కాలంలో విజయవాడ నగర ప్రాంతం పారిశ్రామికంగా ఏ విధంగా అభివృద్ధి చెందాలనే అంశంపై డి.ఆర్.డి.వో మాజీ చైర్మన్, కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ అడ్వైజర్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డితో ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులకు ఎంపి కేశినేని శివనాథ్ తన కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. రాజధాని ప్రాంతంలో ఇండస్ట్రీలు అభివృద్ధి చెందాల్సిన అవసరం, ఇందుకోసం ప్రభుత్వం అందిస్తున్న సహకారం అవసరం ఉందని సతీష్‌రెడ్డి తెలిపారు. పరిశ్రమలు తీసుకువచ్చేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... రాబోయే కాలంలో ఈ ప్రాంతం పారిశ్రామికంగా ఏ విధంగా అభివృద్ధి సాధించాలనే అంశంతో పాటు, డిఫెన్స్ రంగంలో ఎన్నిరకాల పరిశ్రమలు వస్తున్నాయి? ఆ అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చించుకోవటం జరిగిందన్నారు. ఇలాంటి సమావేశాలు మరిన్నీ జరగాల్సిన అవసరం వుందని సతీష్‌రెడ్డి అభిప్రాయపడినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో నగర పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి పారిశ్రామికవేత్తలకు నిత్యం అందుబాటులో వుంటానని, వారికి కావాల్సిన సలహాలు సూచనలు అందిస్తానని సతీష్‌రెడ్డి చెప్పటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధిలో తామందరం కలిసికట్టుగా సతీష్ రెడ్డి సలహాలు సూచనలు తీసుకుని ముందుకు వెళతామన్నారు. అలాగే ఎల్రక్టానిక్స్ సి.ఈ.వో రామకృష్ణ సూచనల ప్రకారం నేటి కాలానికి అనుగుణంగా పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా ఇంజనీరింగ్ కోర్సుల్లో చేయాల్సిన మార్పులు, అదనంగా చేర్చాల్సిన కోర్సుల అంశంపై తామందరం మంత్రి నారాలోకేష్‌ను కలిసి చర్చిస్తామన్నారు. పరిశ్రమలకు ఉపయోగపడే కోర్సులు యూనివర్శిటీలో వుండే విధంగా కృషి చేస్తామన్నారు. ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యుల తరుపున సతీష్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## జగన్ అత్యాశే రాష్ట్ర విద్యుత్ రంగాన్ని పట్టిపీడిస్తుంది : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): దేశంలో ఏ ముఖ్యమంత్రికి లేని అవగాహన విద్యుత్ రంగంపై చంద్రబాబుకు ఉందని, ఆ అనుభవంతోనే రాష్ట్ర విభజన తర్వాత 22 మిలియన్ యూనిట్ల లోటులో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను 2019లో ఆయన దిగిపోయే నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం శాసనసభలో విద్యుత్ రంగం స్థితిగతులపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర టెక్స్‌టైల్ రంగం సమస్యలతో పాటు, ఉమ్మడి గుంటూరు జిల్లాలో మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్ల చోరీ సమస్యను కూడా మాజీమంత్రి సభద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు."చంద్రబాబు మిగులు విద్యుత్ గా మార్చిన రాష్ట్రాన్ని జగన్ తన హాయాంలో విద్యుత్ కోతలకు కేంద్రంగా మార్చాడు. చంద్రబాబు ఇతర రాష్ట్రాలకు విద్యుత్ సరఫరా చేసే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్తే, జగన్ తన అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర విద్యుత్ రంగాన్ని దారుణంగా దెబ్బతీశాడు. పీపీఏల రద్దు నిర్ణయంతో రాష్ట్ర విద్యుత్ రంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసిన జగన్, సోలార్ పవర్ ప్లాంట్లపై దాడులకు పాల్పడి, విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల మూసివేతే లక్ష్యంగా వ్యవహరించాడు. తనకు గిట్టని వ్యక్తులు, సంస్థలే లక్ష్యంగా రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి సంస్థల్ని, వాటి యాజమాన్యాన్ని జగన్ ఇబ్బందులకు గురిచేసి, బిల్లులు కూడా చెల్లించకుండా వేధించి అంతిమంగా రాష్ట్రానికి చీకట్లు మిగిల్చాడు. తాను పెంచిన ఛార్జీల భారం ప్రజలపై మోపిన జగన్, వారినుంచి ముక్కుపిండి మరీ విద్యుత్ ఛార్జీలు వసూలు చేశాడు.

**జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజలపై రూ.1,29,000కోట్ల భారం**

ట్రూ అప్ ఛార్జీలు, నెలవారీ సర్దుబాట్లు, యూనిట్ ఛార్జీల.. ఇతరత్రా పేర్లతో ఐదేళ్లలో రూ.1,29,000 కోట్ల భారం మోపాడు. జగన్ అత్యాశతో పాటు, అనాలోచిత నిర్ణయాలతో ప్రజలు ఈ భారం భరించలేక విసిగిపోయారు. ప్రైవేట్ సంస్థల నుంచి అధిక ధరకు విద్యుత్ కొని, తనకు రావాల్సిన కమీషన్లు దండుకొని జగన్ ఆ సొమ్మును లెక్కపెట్టుకుంటూ తాడేపల్లిలో కూర్చు న్నాడనేది వాస్తవం.

**2014-19 మధ్య చంద్రబాబు ప్రజలపై పైసా విద్యుత్ ఛార్జీలు వేయలేదు..**

చంద్రబాబు హాయాంలో 2014-19 మధ్య ప్రజలపై పైసా విద్యుత్ ఛార్జీల భారం వేయలేదు. ఆనాడు ప్రతిపక్షాలు కూడా ఈ అంశంపై మాట్లాడటానికి సాహసం చేయలేదు. కానీ జగన్ తన హాయాంలో ప్రజలపై లక్షా29వేలకు పైగా వేసిన భారం వల్ల నేటికీ రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ కోలు కోవడానికి చాలా సమయం పడుతుంది. కూటమిప్రభుత్వం క్రమక్రమంగా రాష్ట్ర విద్యుత్ రంగాన్ని సంస్కరిస్తూ, ప్రజలపై భారం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందిస్తోంది. విద్యుత్ సబ్సిడీలు ఇస్తే తప్ప రాష్ట్ర టెక్స్ టైల్ రంగం బతకదని, కేంద్ర ప్రభుత్వం కూడా సహాయసహకారాలు అందిస్తేనే ఏపీలో టెక్స్‌టైల్ రంగం పుంజుకుంటుందని పుల్లారావు అన్నారు.

## మచిలీపట్నాన్ని సీఆర్‌డీఏలో చేర్చండి : మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): నగరాన్ని సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకురావాలని మునిసిపల్ శాఖా మంత్రి నారాయణను కోరానని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. రూ.20 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 100 పుష్‌కార్టులను మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం రాత్రి మచిలీపట్నంలోని పారిశుధ్య కార్మికులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా సరైన పుష్‌కార్టులు లేక పారిశుధ్య కార్మికులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. పారిశుధ్య పనులపై వైసీపీ పాలకులు దృష్టి సారించలేదన్నారు. చెత్తపై పన్ను వేసేందుకు మక్కువ చూపిన వైసీపీ నాయకులు పారిశుధ్యాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో కొన్న తోపుడుబండ్లు ఇప్పటి వరకు పనిచేస్తున్నాయని, ఆ బండ్లు శిథిలం కావడంతో కొత్త బండ్లు కొనుగోలు చేశామన్నారు. తడి, పొడిచెత్తను వేరు చేసేందుకు ఈ తోపుడుబండ్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. లక్ష టన్నుల చెత్తను వైసీపీ పాలకులు ఇచ్చారని, డంపింగ్ యార్డులోని ఆ చెత్తను గుంటూరుకు తరలిస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా కాల్వగట్లపై ఉన్న ఆక్రమణలు తొలగించి పూడికతీత పనులు చేపడుతున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మచిలీపట్నం మునిసిపల్ అధికారులు ఆక్రమణలు తొలగించి అందరి మన్ననలు పొందారన్నారు. కమిషనర్ బాపిరాజు చొరవ తీసుకుని ఆక్రమణలు తొలగించారన్నారు. 13 రోజులుగా ఆక్రమణలు తొలగిస్తున్నామని, ఇందుకు నగర ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అయితే, కొందరు చిరువ్యాపారులు నష్టపోయినట్టు చెబుతున్నారని, వారికి సరైన న్యాయం చేస్తామన్నారు. ముద్ర రుణాలు ఇప్పించి చిరు వ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు

## కరాటే యువ క్రీడాకారుడికి సీఎం చంద్రబాబు ప్రశంస

**●వెంట తీసుకెళ్లి పరిచయం చేసిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**



వినుకొండ (చైతన్యరథం): కరాటేలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న పల్నాడు జిల్లా వినుకొండ మండలం పెదకంచర్ల గ్రామానికి చెందిన యువక్రీడాకారుడు రామినేని రోహన్‌ను ఘనంగా సత్కరించారు ముఖ్యమంత్రి చంద్రబాబు. ఇటీవలే దక్షిణాఫ్రికా రాజధాని డర్బన్ వేదికగా జరిగిన కామన్‌వెల్త్ 11వ కరాటే ఛాంపియన్‌షిప్ గెలుచుకున్న రోహన్‌కు ఏనుగు ప్రతిమ సీఎం చంద్రబాబు అందించి అభినందించారు. గురువారం ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వారిని తీసుకుని వెళ్లి ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. కొంతకాలంగా కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వరస విజయాలతో సత్తా చాటుతున్నాడు 15 ఏళ్ల యువ క్రీడాకారుడు రామినేని రోహన్. ఆ క్రమంలోనే 2024 నవంబర్ 28 నుండి డిసెంబర్ 1 వరకు డర్బన్‌లో జరిగిన కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో తొలి అంతర్జాతీయ పతకం సాధించాడు. 63 కిలోల విభాగంలో అతడు స్వర్ణం గెలిచి విశ్వవేదికపై త్రివర్ణ పతాకను రెపరెపలాడించాడు. ఎలైట్ విభాగంలో స్వర్ణంతో పాటు క్లబ్స్ విభాగంలో కాంస్యం అందుకున్నాడు. అంతకు ముందు జాతీయ, జోనల్ స్థాయిలో పలు పతకాలు గెలుచుకుని కరాటేలో ప్రతిభ చూపాడు రోహన్.... రోహన్ వెంట ఆయన తండ్రి రామినేని శివకృష్ణ, తాత రామినేని రామకోటయ్య, పెదనాన్నలు రామినేని పూర్ణచంద్రరావు, రామినేని సుబ్రమణ్యం ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు రోహన్ ఇలాంటి మరెన్నో విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి, పల్నాడు ప్రాంతానికి, వినుకొండకు మరింత మంచిపేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు . ప్రతిభావంతులైన క్రీడాకారులకు రాష్ట్రంలో ఉజ్వల భవిష్యత్ ఉండబోతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల తీసుకుని వచ్చిన నూతన క్రీడా విధానంతో ఇలాంటి వర్ధమాన, గ్రామీణ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఒకవైపు క్రీడా మౌలిక వసతుల పెంపు, మరోవైపు వివిధ పోటీల్లో గెలిచిన విజేతలకు ప్రోత్సాహం ద్వారా క్రీడారంగానికి ఊతం ఇవ్వాలన్నదే సీఎం చంద్రబాబు ఆలోచనగా తెలిపారు.

## సాగర్ మూడోవ జోన్‌కు 1500 క్యూసెక్కులు సాగునీటిని విడుదల చేయాలి : ఆళ్ళ వెంకటగోపాలకృష్ణ




విజయవాడ (చైతన్యరథం): నాగార్జున సాగర్ ఎడమ కాలువ మూడోవ జోన్‌లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్న పరిస్థితులలో ఆయకట్టులోని తిరువూరు, మైలవరం, నూజివీడు, నందిగామ ప్రాంతాలకు నీటిని విడుదల చేయాలని ఆంధ్ర ప్రదేశ్ బోర్డర్ రెగ్యులేటర్ దగ్గర నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు కోరారు. ఈ విషయంపై ఇటీవల గన్నవరం శాసనసభ్యులు అసెంబ్లీ వేదికగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ద్వారా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా ఈ విషయంపై గురువారం ఉదయం ఎన్.టి.ఆర్. జిల్లా విస్సన్నపేట మండలం నుతిపాడు దగ్గర ఎడమ కాలువ 101వ కి.మీ. డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్‌లు యన్.టి.అర్. జిల్లాకు చెందిన తాళ్లూరి రవిశంకర్, కటారి కోటేశ్వరరావు, కొల్లి శ్రీనివాసరెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, ఏలూరు జిల్లా చెందిన రాపర్ల బాలకృష్ణ, కృష్ణాజిల్లాకు చెందిన దేవినేని సత్యన్నారాయణ తదితరులు సాగర్ జలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ సమయంలో కేవలం 234 క్యూసెక్కులుపైన ఉన్న తెలంగాణ ప్రభుత్వం కిందకు విడుదల చేయడాన్ని వారు గమనించారు.

## జగన్ ఇంటి ముందు ధర్నాలు చేయాలి : బెజవాడ

జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా విద్యార్థులకు రూ.4వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించలేదు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు. ఐదేళ్ల పాటు యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారు. యువతను మోసగించింది చాలక యువత పోరుబాట పేరుతో వైసీపీ కార్యక్రమం నిర్వహించడం సిగ్గుచేటు. విద్యార్థులను మోసం చేసిన జగన్ ఇంటి ముందు వైసీపీ నాయకులు నిరసన తెలపాలి.' అని తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ నాగరాజు విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలోని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2832 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ. 989 కోట్లు, పీజీ ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.450 కోట్లు బకాయి పెట్టిందని ఆయన ఆరోపించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎరిక్షన్‌బాబు



యర్రగొండపాలెం (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 26 మందికి మొత్తం రూ.42,12,564/- ల చెక్కులను ఎరిక్షన్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్నవారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, ఎరిక్షన్‌బాబుకి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న నెల్లూరు రూరల్ నియోజకవర్గం



నెల్లూరు (చైతన్యరథం): కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రాష్ట్రంలోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నెంబర్ వన్‌గా నిలుపుతున్నారని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వ్యాఖ్యానించారు. అభివృద్ధి పనులకు ఎక్కడి నుంచైనా నిధులు తెచ్చే కళ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికే ఉందన్నారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని బారాషాహీద్ దర్గా ముఖ ద్వారాలకు రూ.85లక్షల వ్యయంతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. బారాషాహీద్ దర్గా అభివృద్ధికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచనల మేరకు రూపొందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి తొక్కిసలాట ఘటన... మూడో దశ విచారణ



తిరుపతి (చైతన్యరథం): వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ తొక్కిసలాట నేపథ్యంలో మూడో దశ విచారణలో భాగంగా ఈనెల 14, 15, 16 తేదీల్లో న్యాయ విచారణ కమిషన్ జస్టిస్ సత్యనారాయ ణమూర్తి తిరుమలలో క్యూ లైన్ల నిర్వహణను కూడా పరిశీంచనున్నారు. ఈనెల 17వ తేదీ నుంచి తిరుపతిలో జరగనున్న విచారణకు నేరుగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ ఈవో శ్యామలరావు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఇప్పటికే సమన్లు జారీ చేశారు. కాగా వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి (ఫిబ్రవరి 24వ తేదీ) విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో జస్టిస్ సత్యనారాయణమూర్తి బాధితులను విచారించారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. తిరుపతి కలెక్టరేట్ వేదికగా కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాణమూర్తి శనివారం (ఫిబ్రవరి 22వ తేదీ)రెండో దశ విచారణ చేపట్టారు. 11 మందిని విచారించారు. ఇదే ఘటనలో విశాఖకు చెందిన కొందరు మృతిచెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. విచారణకు హాజరు కావాలని ఈ ప్రాంతానికి చెందిన 19 మంది బాధితులకు న్యాయవిచారణ కమిషన్ నోటీసులు జారీ చేసింది. అయితే తామింకా కోలుకోలేదని గాయాలు ఇబ్బంది పెడుతున్నాయని, అంత దూరం రాలేమని వర్చువల్ (జూమ్) మీటింగ్‌లో పాల్గొని ఘటపై వివరిస్తామని వారు కమిషన్‌కు లిఖితపూర్వకంగా వివరణ పంపించారు. దీంతో జస్టిస్ సత్యనారాయణమూర్తి ఆదివారం (ఫిబ్రవరి 23వ తేదీ) ఉదయం విజయవాడకు బయలుదేరి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం వైజాగ్ గోపాలపట్టణం తహసీల్దారు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో న్యాయవిచారణ కమిషన్ ఎదుట బాధితులు హాజరయ్యారు. విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి వారిని విచారించారు. కాగా, ఈ తొక్కిసలాట ఘటనలో గాయపడిన వారిలో కొందరు కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్నారు. వీరూ వర్చువల్ విధానంలో విచారణకు హాజరు అయ్యారు. దీని తర్వాత మూడో దశ విచారణ ఈనెల 17వ తేదీ నుంచి తిరుపతిలో జరగనుంది.

# నెల్లూరు కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో వైసీపీ గొడవ



నెల్లూరు (చైతన్యరథం): కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం కూటమి, వైసీపీ సభ్యుల గొడవ మధ్య వాడీవేడిగా సాగింది. మేయర్ స్రవంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు సమస్యలపై కన్నా ముందు ఎవరు మాట్లాడాలనే దానిపై గొడవ జరిగింది. నగరంలో పారిశుద్ధ్యం సరిగా లేదని, కాలువలపై ఆక్రమణలు ఉన్నాయని, పన్నులు వసూలు చేసి కార్పొరేషన్ ఆదాయం పెంచాలని కోరారు. జనాభా పెరుగుతున్న వసతులు పెరగడం లేదని చెప్పారు. అయితే వైఎస్సార్సీపీ సభ్యులు, కూటమి సభ్యుల మధ్య గొడవ జరిగింది. సమావేశంలో సభ్యులు సమస్యలపై కన్నా ముందు ఎవరు మాట్లాడాలనే దానిపై గొడవపడ్డారు. డిప్యూటి మేయర్ రూప్ కుమార్ యాదవ్ అజెండాలోని అంశాలు చదివిన తరువాత వార్డుల వారీగా సమస్యలు చెప్పాలని కోరారు. కానీ వైసీపీ సభ్యులు మాత్రం ముందుగానే సమస్యలను వినిపించడంతో గొడవ జరిగింది. నగరంలో దోమలు బెడద ఉందని, ఫాగింగ్ చేయడం లేదని విమర్శించారు. ప్రజలు నిద్ర పోవడం లేదని ఫిర్యాదు చేశారు. హెూటల్స్‌లో ఫుడ్ ధరలు విపరీతంగా ఉంటున్నాయని, ఇంకా నాణ్యత కూడా ఉండట్లేదని పైగా నిల్వ ఉన్న ఆహారం పెడుతున్నారని సభ్యులు లేవనెత్తారు. దీనిపై అధికారులు స్పందించి తదితర హెూటల్స్‌పై దాడులు చేయాలని కోరారు. నగరంలోని డ్రైనేజీలపై అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని వెంటనే వాటిని తొలగించాలని సభ్యులు కోరారు.


# కావలి ఇంజినీరింగ్ కళాశాలలో ఉద్యోగాల ఎంపిక




కావలి (చైతన్యరథం): స్థానిక డి.బి.ఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం చెన్నైకి చెందిన మదర్ సన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగ ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనిలో భాగంగా ఈసీఈ భాగానికి చెందిన 50 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. 12 మంది విద్యార్థినిలు మూడు రౌండ్లను ఎదుర్కొని 2.52 సంవత్సరానికి ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. దీంతో డి.బి ఎస్.ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా కళాశాల నందు 12 మంది ఈసీఈ విభాగానికి చెందిన అమ్మాయిలు మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు పొందటం గర్వించ దగ్గ విషయమన్నారు. ఉద్యోగులుగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదు పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని, ధైర్యంతో ముందుకు సాగితే విజయం తప్పక వరిస్తుందని వై.సి. వెంటోరియస్ గ్రూప్స్ సీ.ఈ.ఓ చిన్ని యశోవర్ధన్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్ క్లబ్ నందు సాయి భక్త మండలి ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి చిన్ని యశోవర్ధన్ ను కమిటీ సభ్యులు ఘనంగా శాలువులతో పూలమాలలతో సత్కరించారు.

# పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఒంగోలు (చైతన్యరథం): జిల్లాలో ఈనెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మకంగా గుర్తించిన పరీక్షా కేంద్రాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. జిల్లాలో 183 కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిల్లో ఆరు సున్నితమైన, సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వాటిలో బేస్తవారపేట మండలం పిటికాయ గుళ్ల, పెద్దారవీడు మండలం వైడిపాడు, అర్ధవీడు మండలం మాచవరం, రాచర్ల, సీఎస్‌పురం జడ్పీ హైస్కూళ్లు, కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కేంద్రాలు ఉన్నాయి. ఇంటర్ పరీక్షల తరహాలోనే ఈ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ఒంగోలులోని డీఈవో కార్యాలయం, విజయవాడలోని పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం చేస్తున్నారు. ఈ రెండు చోట్ల నుంచి అధికారులు పరీక్ష జరుగుతున్న తీరును నేరుగా సమీక్షించవచ్చు. అదేవిధంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, అధికారుల బృందాలు ఈ కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టిసారించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నారు.



# వెంకటగిరి పరిధిలో నలుగురు బాలికలు మిస్సింగ్

వెంకటగిరి పోలీస్ సర్కిల్ పరిధిలో నలుగురు బాలికలు, ఓ మహిళ మిస్సింగ్ కావడం కలకలం రేపింది. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతూ, ఎస్సీ హాస్టల్లో ఉంటున్న ముగ్గురు బాలికలు, బొప్పాపురం సాలికాలనీకి చెందిన రాయవరం లిఖిత అనే బాలిక 16 (ఏళ్లు), డక్కిలి మండలం మాటుమాడుగు గ్రామానికి చెందిన స్వర్ణ దేవి అనే మహిళ మిస్సింగ్ అయ్యారు. వారు ఇంటికి రాకపోయేసరికి ఆందోళన చెందిన వారి కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా ఎస్సీ హాస్టల్ నుంచి మిస్సింగ్ ఆయన ముగ్గురు బాలికలను పోలీసులు తిరుపతిలో గుర్తించినట్లు సమాచారం. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. కాగా రెండు వారాల క్రితం కృష్ణా జిల్లాలో మాయమైన ఆ బాలికలు గుంటూరులో ప్రత్యక్షమయ్యారు. వివరాల్లోకి వెళితే.. గన్నవరం మండలం ముస్తాబాదుకు చెందిన నలుగురు బాలికలు విజయవాడలోని ఓ ప్రైవేటు కాలేజిలో చదువుతున్నారు. అంతకుముందు రెండు రోజులుగా వారు కాలేజికి వెళ్లలేదు. అక్కడి నుంచి షాపింగ్‌మాల్‌కు వెళ్లి.. అటు నుంచి షికారులు చేశారు. విషయం తెలుసుకున్న కాలేజీ యాజమాన్యం వారిని మందలించి.. వారి తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వారు కూడా బాలికలను మందలించారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన వారు ఇంటి నుంచి వెళ్లిపోయారు. విషయం గమనించిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. బాలికలు హైదరాబాదు వెళుతుండగా పిడుగురాళ్ల సమీపంలో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారికి కౌన్సింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.



# ఆగిపోయిన టీడ్కో ఇళ్లను పూర్తి చేయాలి

- అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



పుట్టపర్తి (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ నిర్వాహకంతో 2018 టీడీపీ హయంలో మంజూరైన టిడ్కో ఇల్లు అర్ధాంతరంగా ఆగిపోయాయని, ఈ ప్రభుత్వంలోనైనా ఆ నిర్మాణాలను పూర్తి చేయాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడలో శాసనసభ సమావేశాల సందర్భంగా గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో పుట్టపర్తి టిట్కో ఇండ్ల నిర్మాణంపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రస్తావించారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో 16.35 ఎకరాలలో 1243 టిడ్కో ఇండ్లను మంజూరు చేశారు. అయితే ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 811 గృహాలను రద్దుచేసిందని వీటిలో 432 గృహాలను కట్టిస్తామని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. అందులో కేటగిరి వన్ కింద 80 శాతం కేటగిరి టు కింద 50% కేటగిరి 3క్రింద 20 శాతం పనులు పూర్తి చేసుకున్నాయని తెలిపారు. అయితే ఇండ్ల నిర్మాణం కోసం చాలా మంది లబ్ధిదారులు కట్టిన డిపాజిట్ల డబ్బులు కూడా వెనక్కి ఇవ్వలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో టిడిపి హయాంలో మంజూరైన వాటిలో వైసీపీ ప్రభుత్వం 811 గృహాలను రద్దు చేసిందని వాటికి ఈ ప్రభుత్వం రీటెండర్లు నిర్వహించి తిరిగి ఇల్లు కట్టించే అవకాశం ఏమైనా ఉందా అని ప్రభుత్వాన్ని కోరారు. గత వైసీపీ ప్రభుత్వ మోసపూరిత వాగ్దాన నిర్వాహకం వల్ల సుమారు 6వేల కుటుంబాలు ప్రభుత్వానికి కట్టిన డిపాజిట్లు తిరిగి రాక పోవడమే కాకుండా ఇల్లు వారి పేరుపై మంజూరు కావడం వల్ల బ్యాంకు వాటికి ఇచ్చిన రుణాలు కట్టలేకపోవడం ప్రభుత్వం ఇల్లు కూడా ఇవ్వకపోవడంతో వారు ఇప్పుడు డిపార్టరుగా బ్యాంకులు మొండి బకాయిలు కింద చూపిస్తూన్నాయని ఈ అంశాన్ని ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తిరిగి వారికి బ్యాంకులు రుణాలు ఇచ్చే పరిస్థితి లేదని అలాంటి వారినీ ఈ ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం ద్వారా పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువచ్చారు. వైసీపీ హయంలో కేటగిరి వారీగా విభజించి రూ.1 కే కొందరికి ఇల్లు ఇస్తామని, మరో కేటగిరి వారికి 25000 లకే, 50 వేలు కట్టిన వారికి మరో కేటగిరి ప్రకారం ఇల్లు పూర్తి నిర్మాణ చేసి ఇస్తామని వైసీపీ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాల కారణంగా చాలామంది లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి వెల్లడించారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం గత టీడీపీ హయాంలో మంజూరైన టిడ్కో ఇళ్లను సకాలంలో పూర్తి చేసి వాటిని లబ్ధిదారులకు అందించాలని కోరారు.

# విద్యార్థులకు వినికిడి లోపం శాపంగా మారకూడదు

- దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్ చేస్తున్న సేవ వెలకట్టలేనిది
- విద్యార్థులకు పరికరాలు అందించిన శ్రీరామ్




ధర్మవరం (చైతన్యరథం): విద్యార్థులకు వినికి లోపం శాపంగా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రామగిరి మండల కేంద్రంలో దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వినికిడి యంత్రాలను ఉచితంగా అందించేందుకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. రామగిరి మండలం కేంద్రంలోని పరిటాల రవీంద్ర ఆడిటోరియంలో గురువారం క్యాంపులు మొదలయ్యాయి. ఈనెల 15వ వరకు ఈ క్యాంపులు జరగనున్నాయి. దారిద్ర రేఖకు దిగువన ఉండి, తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ఎల్‌కేజీ నుండి పీజీ వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఈ క్యాంపులు నిర్వహిస్తున్నారు. సమస్య ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి.. అవసరమైన వారికి 25వేల నుంచి 30వేల విలువగల మిషన్ ఇన్స్ట్రుమెంట్ ను ఉచితంగా అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీరామ్ వినికిడి శక్తి లేని విద్యార్థులకు వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సాధారణంగా వినికిడి లోపం వృద్ధులకు, పెద్దలకు వస్తే అంత పెద్ద సమస్యగా ఉండదని.. కానీ చదువుకునే వయసులో ఇది ఉంటే చాలా ఇబ్బందులు పడుతారన్నారు. ఇలాంటి విద్యార్థుల తల్లిదండ్రులు వారిని ఎంతో ఓపికగా చూసుకోవడం చాలా కష్టంగా ఉంటుందన్నారు. అలాంటి తల్లిదండ్రులకు హాట్సాఫ్ చెప్పాలన్నారు. విద్యార్థులకు ఇది శాపంగా మారకుండా ఉండేందుకు దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్ చేస్తున్న కృషి చాలా గొప్పదన్నారు. ఆ సంస్థ ఇప్పటికే ఎంతో మందికి మేలు చేసిందన్నారు. ఇప్పుడు రామగిరి లాంటి మారు మూల ప్రాంతాల్లో క్యాంపులు నిర్వహించి..ఉతితంగా పరికరాలు ఇవ్వడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈక్యాంపులు ఇంకా రెండు రోజులు ఉంటాయని వినికిడి శక్తి లేని వారు సద్వినియోగం చేసుకోవాలని శ్రీరామ్ సూచించారు.

# వైభవంగా అహోబిలంలో రథోత్సవం



ఆళ్లగడ్డ (చైతన్యరథం): మండల పరిధిలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఎగువ అహోబిలంలో రథోత్సవం వైభవంగా జరిగింది. జ్వాల నారసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవాళ్లను విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుతీర్చి ఆలయం బయట ఊరేగించారు. ఈ క్రమంలో స్వామి వారిని విశేషంగా అలంకరించి కొలువుంచి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. అర్చకులు, బోయీలు స్వామి రథం ముందుకు కదిలించారు. రథంపై విహరిస్తున్న స్వామిని దర్శించుకుని భక్తులు గోవింద నామస్మరణలు చేశారు. దిగువాహోబిలంలో ప్రహ్లాద వరద స్వామి కాలింగ నర్తనోత్సవ అలంకరణలో దర్శనమిచ్చారు. మధ్యాహ్నం స్వామివారిని పంచామృతాలతో అభిషేకం చేశారు. సాయంత్రం స్వామి అమ్మవారికి తొట్టి తిరుమంజనం జరిపారు. రాత్రి అస్వ వాహనంపై స్వామి దర్శనం ఇవ్వనున్నారు. పీఠాధిపతి రంగనాథ యతేంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

# వైసీపీ యువత పోరు అట్టర్ ప్లాప్ : పిఎల్ఎన్ మూర్తి



అనంతపురం (చైతన్యరథం): గత వైసీపీ పాలనలో విద్యార్థులకు తీరని అన్యాయం చేసి ఇప్పుడు యువత పోరు యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ అండ్ కార్పొరేషన్ డైరెక్టర్ పిఎల్ఎన్ మూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం టీడీపీ అర్బన్ కార్యాలయం నందు పి ఎల్ ఎన్ మూర్తి పత్రికా సమాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన యువత పోరు యాత్ర అనంతపురం నగరంలో అట్టర్ ప్లాప్ అయిందని పేర్కొన్నారు. 2019 నుంచి 2024 మధ్య విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్మెంట్‌ను విద్యా జీవనగా పేరు మార్చారన్నారు. కానీ ఏమాత్రం విద్యార్థులకు ఫీజు రివర్స్‌ను అందించకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాలన విద్యార్థులను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. యువత పోరు పేరుతో యువతకు ధర్నాలకు పిలుపునిచ్చిన వైసీపీ నాయకులకు యువత తగిన బుద్ధి చెప్పారని పిఎల్ఎన్ మూర్తి పేర్కొన్నారు.

# యువత పేరుతో వైసీపీ సరికొత్త డ్రామా

- అసెంబ్లీకి రాకుండా వీధి నాటకాలు ఏంటని ఎమ్మెల్యే దగ్గుపాటి మండిపాటు




అనంతపురం (చైతన్యరథం): అధికారంలో ఉన్నప్పుడు లక్షల కోట్లు అప్పులు చేసి... ఇప్పుడు నిరసల పేరుతో వైసీపీ డ్రామాలు ఆడుతోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వైసీపీ చేపట్టిన యువత పోరు కార్యక్రమంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన తర్వాత ఉనికి కోసం.. ఇలాంటి పెయిడ్ నిరసనలు చేస్తున్నారని విమర్శలు చేశారు. మీ పాలనలో విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారన్నారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిల్లో ఈ ఏడాది ఇప్పటికే కూటమి ప్రభుత్వం రూ.788 కోట్లు చెల్లించిందన్నారు. ఇంకా వైసీపీ హయాంలో పేరుకుపోయిన బకాయిలను తెలుగుదేశం ప్రభుత్వంలో విడతల వారీగా చెల్లిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం అప్పులు చేసి ఖజానాను ఖాళీ చేసిందని, ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి యువత పోరు పేరిట వీధి నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌పై చర్చకు సిద్ధంగా ఉన్నామని మా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారన్నారు. కానీ చర్చకు రాకుండా కేవలం నినాదాలు చేసి.. గందరగోళం సృష్టించారని..వైసీపీ ఎమ్మెల్సీలపై విమర్శలు చేశారు. ఉద్యోగాలు, ఉపాధి కల్పనపై మాట్లాడేందుకు కూడా ప్రభుత్వం రెడీగా ఉందన్నారు. మొదట్లో ఫీజు పోరు అని.. ఆతర్వాత యువత పోరుగా మార్చారంటే.. అసలు ఏ అంశంపై పోరాడుతున్నారో వారికే స్పష్టత లేదన్నారు. పైగా అనంతపురంలో కొందరు నాయకులు తమ స్థాయి మరచి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ మాట్లాడుతున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో కచ్చితంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లిస్తుందని, ఉద్యోగాలు కూడా కల్పిస్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

# వివేకా హత్యకేసు సాక్షుల అనుమానాస్పద మరణాలు - అప్రూవర్ దస్తగిరికి భద్రత పెంపు



కడప (చైతన్యరథం): వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసులో అప్రూవర్ దస్తగిరికి భద్రత పెంచుతూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం 1+1 గన్‌మెన్‌లతో భద్రత కల్పిస్తుండగా ప్రస్తుతం 2+2 గన్‌మెన్‌లను కేటాయించినట్టు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. వివేకా హత్యకేసులో సాక్షులు అనుమానాస్పదంగా మృతి చెందుతున్న నేపథ్యంలో తనకు భద్రత పెంచాలని దస్తగిరి జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిని పరిశీలించిన పోలీసు ఉన్నతాధికారులు దస్తగిరికి భద్రత పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. గురువారం సాయంత్రం ఇద్దరు గన్‌మెన్లు దస్తగిరి ఇంటి వద్ద విధుల్లో చేరారు.

# విజయవాడ దుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పూజలు



రాప్తాడు (చైతన్యరథం): ఎమ్మెల్యే పరిటాల సునీత విజయవాడ కనకదుర్గమ్మకు పూజలు నిర్వహించారు. కుటుంబసభ్యులతో కలిసి ఆమె అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ అమ్మవారిని ఎప్పుడు దర్శించుకున్నా ఒక ప్రత్యేకమైన అనుభూతి ఉంటుందన్నారు. శక్తి స్వరూపిణిగా ఉన్న దుర్గమ్మ తల్లి మా ప్రాంత ప్రజలను చల్లగా చూడాలని వేడుకున్నట్టు తెలిపారు. అమ్మవారి కృపతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. రాజధాని, పోలవరం ప్రాజెక్టులు త్వరలోనే పూర్తి చేసేలా ముఖ్యమంత్రికి అమ్మవారి కృపాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు.

# ఒక్క 'క్లిక్'.. రూ.24లక్షలు హుష్‌కాకి!

**అన్‌లైన్ గెమ్స్ మాయ.. కూడబెట్టిన సొమ్మంతా పోగొట్టిన చిన్నారి..**



పిల్లలకు ఆడుకోవడానికి మొబైల్ ఫోన్లు ఇస్తే అది వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. కొన్ని సార్లు మీకు భారీ ఆర్థిక నష్టం కూడా తెచ్చిపెట్టొచ్చు! ఇలాంటి ఘటన తమిళనాడులోని తేని జిల్లాలో జరిగింది. ఓ పిల్లాడు పొరపాటున చేసిన పనివల్ల రూ.24 లక్షలు కోల్పోయారు వారి తల్లిదండ్రులు. చిన్నారి సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం వల్ల క్రమంగా డబ్బులు పోగొట్టుకున్నారు.

ఇదీ జరిగింది

జిల్లాలోని తేవరం ప్రాంతానికి చెందిన శివనేసన్(42) స్థానికంగా కిరాణ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆతడి భార్య నగలు తాకట్టు వ్యాపారం చేస్తోంది. ఇద్దరు తాము సంపాదించిన డబ్బును బ్యాంకులో దాచుకున్నారు. ప్రతి మూడు నెలలకొకసారి బ్యాంకుకు వెళ్లి తమ డబ్బు భద్రంగా ఉందో లేదో చెక్ చేసుకునేవారు. అలాగే ఇటీవల తమ ఖాతాలను తనిఖీ చేయడానికి బ్యాంకుకు వెళ్లాడు శివనేసన్. తన సెల్‌ఫోన్ నంబర్‌కు లింక్ చేసిన మూడు బ్యాంకు ఖాతాల నుంచి తనకు తెలియకుండానే రూ.24.69 లక్షలు (రూ.24,69,600) విత్‌డ్రా అయినట్లు శివనేసన్ కనుగొన్నాడు. ఈ విషయపై బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించాడు. తన బ్యాంకు ఖాతా నుంచి వేర్వేరు అకౌంట్లకు విడతల వారిగా డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయినట్లు తెలుసుకున్నాడు. అనంతరం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శివనేసన్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అందులో భాగంగా దంపతుల మొబైల్ చెక్ చేయగా, వారి పిల్లాడు ఫోన్‌లో తరచూ వీడియో గేమ్‌లు ఆడేవాడని తెలిసింది. అతడు అనుకోకుండా డౌన్‌లోడ్ చేసిన యాప్ ద్వారా సైబర్ మోసగాళ్లు బ్యాంకు ఖాతా వివరాలను పొందినట్లు తేలింది.

దంపతుల అకౌంట్ నుంచి మొత్తం 9 వేర్వేరు అకౌంట్లకు డబ్బులు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. అందులో ఓ ఖాతా పట్నా(బిహార్)కు చెందిన అర్జున్ కుమార్(22) పేరు మీద ఉన్నట్లు తెలిసింది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటాచలం నేతృత్వంలోని ప్రత్యేక బృందం అర్జున్ బెంగళూరులో ఉన్నట్లు గుర్తించింది. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

విచారణలో ఈ డబ్బు దొంగతనానికి, తనకు ఎలాంటి సంబంధం లేదని అర్జున్ కుమార్ చెప్పాడు. కొందరు దుండగులు తన బ్యాంక్ అకౌంట్ వివరాలు, మొబైల్ నంబర్ ఇస్తే డబ్బులు ఇస్తానన్నారని, అందుకే వారికి తన వివరాలు ఇచ్చినట్లు తెలిపాడు. తన స్నేహితులు చాలా మంది ఇలా మోసగాళ్లకు వివరాలు ఇచ్చినట్లు చెప్పాడు. విచారణ తర్వాత అర్జున్ కుమార్‌ను జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి జిల్లా జైలుకు తరలించారు.

# స్పేడెక్స్ డీ డాకింగ్ విజయవంతం



ఢిల్లీ: అంతరిక్ష ప్రయోగాల్లో భాగంగా ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానం చేసే మిషన్‌ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన విషయం తెలిసిందే. భవిష్యత్‌లో చేపట్టబోయే భారీ అంతరిక్ష యాత్రలకు అవసరమైన ఈ కీలక పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టిన ఇస్రో ఆ దిశగా మరో అడుగు వేసింది. తాజాగా స్పేడెక్స్ డీ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించింది. దీనిపై అంతరిక్ష సంస్థకు కేంద్రమంత్రి జితేంద్రసింగ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విజయం ప్రతి భారతీయుడిలో ఉత్సాహాన్ని నింపుతుంది. నమ్మశక్యం కాని డీ డాకింగ్ ప్రక్రియను స్పేడెక్స్ శాటిలైట్లు పూర్తి చేశాయి. భారతీయ అంతరిక్ష స్టేషన్, చంద్రయాన్-4, గగన్యాన్ సహా భవిష్యత్ ప్రయోగాలకు మార్గాన్ని సుగమం చేసింది.. అని మంత్రి ఎక్స్ వేదికగా మంత్రి పోస్ట్ చేశారు. ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానించే మిషన్లో భాగంగా ఇస్రో.. గతేడాది డిసెంబర్ 30న ఛేజర్, టార్గెట్ జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపించింది. పలు ప్రయత్నాల అనంతరం చివరకు జనవరి 16న డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా చేపట్టింది. దీంతో ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో ఈ ప్రయోగాలను పునఃప్రారంబించేందుకు సిద్ధమైంది.

# యూ ట్యూబ్ వీడియోలు చూసి స్మగ్లింగ్ నేర్చుకున్నా

**- కన్నడ నటి రన్యారావు వాంగ్మూలం**



బెంగళూరు: దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన కన్నడ నటి రన్యా రావు వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసులో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు ఆమెను కస్టడీలోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. విచారణ సందర్భంగా ఆమె పలు విషయాలను వెల్లడించినట్లు తెలుస్తోంది. గుర్తు తెలియని వ్యక్తి నుంచి తనకు కాల్స్ వచ్చాయని, యూట్యూబ్ వీడియోలు చూసి స్మగ్లింగ్ చేయడం నేర్చుకున్నానని ఆమె వాంగ్మూలంలో పేర్కొన్నట్లు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. గత రెండు వారాలుగా గుర్తుతెలియని వ్యక్తుల నుంచి నాకు కాల్స్ వచ్చాయి. మార్చి 1న ఓ విదేశీ ఫోన్ నంబరు నుంచి ఫోన్ వచ్చింది. దుబాయ్ ఎయిర్‌పోర్టులోని టెర్మినల్ 3 వద్ద ఉన్న గేట్ ఏ వద్దకు వెళ్లాలని సూచించారు. అక్కడ బంగారం తీసుకుని బెంగళూరులో డెలివరీ చేయాలని చెప్పారు. దుబాయ్ నుంచి ఇంతకు ముందెన్నడూ బంగారాన్ని అక్రమంగా తీసుకురాలేదు. స్మగ్లింగ్ చేయడం ఇదే మొదటిసారి అని రన్యా రావు అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది.

రెండు ప్లాస్టిక్ కవర్లలో బంగారాన్ని ఇచ్చారు. దాన్ని దాచడం కోసం బ్యాండేజ్‌లు, కత్తెరలను ఏయిర్‌పోర్టులో కొన్నాను. ఆ తర్వాత రెస్ట్‌రూముకి వెళ్లి ఆ బంగారం కడ్డీలను నా శరీరానికి అతికించుకున్నా. జీన్స్ బూట్లలో దాచిపెట్టా. ఇదంతా యూట్యూబ్ వీడియోలు చూసి నేర్చుకున్నా అని నటి వాంగ్మూలంలో పేర్కొన్నారు. అయితే, కాల్ చేసిన వ్యక్తి ఎవరన్న విషయం మాత్రం తనకు తెలియదని చెప్పారు. అతడి భాష చూస్తే ఆఫ్రికన్ -అమెరికన్లా అనిపించిందన్నారు. ఆ బంగారం ఎవరికి ఇవ్వాలో కూడా తనకు తెలియదని నటి చెప్పారు. ఎయిర్‌పోర్టు టోల్ గేట్ నుంచి బయటకు వచ్చాక సర్వీస్ రోడ్డులో వెళ్లమని నాకు సూచించారు. అక్కడ సిగ్నల్ దగ్గర అగి ఉన్న ఆటోలో పెట్టి వెళ్లిపోవాలని చెప్పారు. ఆ వ్యక్తి ఎవరనేది నాకు తెలియదు అని దన్యారావు అధికారులకు తెలిపారు. ఫొటోగ్రఫీ, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే తాను పలుమార్లు దుబాయ్‌కి వెళ్లినట్లు ఆమె చెప్పారు. గతంలో యూరప్, ఆఫ్రికా, అమెరికాకు కూడా అనేకసార్లు వెళ్లానని పేర్కొన్నారు. ఈ వివరాలపై డీఆర్ఐ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఆమె ఫోన్, ల్యాప్‌ట్యాప్‌లో ఉన్న డేటా ఆధారంగా స్మగ్లింగ్ సిండికేట్ నంబర్లను ట్రాక్ చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

**పార్కింగ్ విషయంలో గొడవ**

# దాడిలో యువ శాస్త్రవేత్త మృతి



మొహాలీ: ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఓ చిన్న బైక్ పార్కింగ్ గొడవ, క్రమంగా దాడి చేసుకునే వరకు వెళ్లి, ఒకరి హత్యకు దారి తీసింది. ఓ యువ శాస్త్రవేత్తకు తన బైక్ పార్కింగ్ విషయంలో మరో వ్యక్తితో వివాదం మొదలైంది. అది కాస్తా క్రమంగా దుర్భాషలాడుకునే వరకు వెళ్లింది. ఆ తర్వాత గొడవ మరింత తీవ్రం కావడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఆ క్రమంలోనే ఓ వ్యక్తి మరణించాడు. పంజాబ్‌లోని మొహాలీలో ఇటీవల చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

గతంలో విదేశాల్లో ఉన్న యువ శాస్త్రవేత్త డాక్టర్ అభిషేక్(39) ఇటీవల భారత్ తిరిగి వచ్చి, మొహాలిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లో చేరాడు. ఆ క్రమంలోనే శాస్త్రవేత్త తన బైక్ పార్కింగ్ విషయంలో సెక్టార్ 66లో గత మంగళవారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో తన ఇంటి పొరుగువాడైన మాంటీతో గొడవ పడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య వాదన పెరగడంతో, మాంటీ అభిషేక్‌పై తీవ్రంగా దాడి చేశాడు. ఆ క్రమంలో ఆతని కుటుంబ సభ్యులు గొడవను ఆపేందుకు ప్రయత్నించారు. కానీ మాంటీ మాత్రం ఆపలేదు. దాడిలో భాగంగా మాంటీ అభిషేక్ కడుపు, ఛాతీపై బలంగా కొట్టాడు. దీంతో అతను నేలపై పడిపోయాడు. వెంటనే అతన్ని ఓ ఆసుపత్రికి తరలించారు. కానీ వైద్యులు పరీక్ష చేసిన తర్వాత అతను చనిపోయినట్లు ప్రకటించారు.

మరణించిన శాస్త్రవేత్తను జార్ఖండ్‌కు చెందిన 39 ఏళ్ల అభిషేక్ స్వర్ంకర్‌గా గుర్తించారు. ఆ శాస్త్రవేత్తకు ఇటీవల కిడ్నీ సర్జరీ జరిగిందని, అతని సోదరి కిడ్నీ ఇచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయనకు డయాలసిస్ జరుగుతోందని, ఆ క్రమంలోనే కడుపులో గుద్దడం వల్ల అతను మరణించాడన్నారు. దీంతో ఈ విషయంపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు మాంటీని అరెస్ట్ చేశారు. ఈ దాడికి సంబంధించిన వీడియో సీసీ టీవీ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**స్నేహితుడిని నమ్మి ఇండియా వచ్చి..**

# అతడి చేతిలోనే అత్యాచారానికి గురైన బ్రిటన్ యువతి



ఢిల్లీ: సోషల్ మీడియా వేదికగా పరిచయమైన స్నేహితుడి మాయమాటలు నమ్మి, అతడిని కలిసేందుకు బ్రిటన్ నుంచి భారత్‌ను వచ్చిన ఓ యువతి అతడి చేతిలోనే అత్యాచారానికి గురైంది. ఇక్కడికి వచ్చిన ఆమె అతడి చేతిలోనే ఘోరంగా మోసపోయింది. హెూటల్ గదిలో అత్యాచారానికి గురైంది. ఢిల్లీలోని మహిపాల్‌పూర్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. ఢిల్లీలో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న కైలాశ్‌కు బ్రిటన్‌కు చెందిన యువతితో ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. అతడిని చూసేందుకు ఇటీవల ఆమె భారత్‌కు వచ్చింది. మహిపాల్‌పూర్‌లోని ఒక హెూటల్ గదిని బుక్ చేసుకుంది. ఆమెను కలిసేందుకు వచ్చిన కైలాశ్, మహిళతో అభ్యంతరకరంగా వ్యవహరించాడు. మరో స్నేహితుడితో కలిసి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. వారి నుంచి తప్పించుకున్న బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. తొలుత కైలాశ్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, అక్కడి నుంచి తప్పించుకొని రిసెప్షన్ వద్దకు చేరుకునేందుకు లిఫ్ట్ ఎక్కిన తనను అతడి స్నేహితుడు లైంగికంగా వేధించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. భారత్‌కు వచ్చిన ఆ యువతి తొలుత మహారాష్ట్ర, గోవాల్లో పర్యటించింది. కైలాశ్‌ను కూడా అక్కడికి రమ్మని అడిగింది. అయితే తాను రాలేనని చెప్పి, ఆమెనే ఢిల్లీకి రావాలని కోరాడు. ఆమెతో ఇంగ్లిష్ మాట్లాడేందుకు ఇబ్బందిపడిన కైలాశ్.. గూగుల్ ట్రాన్స్‌లేట్ వాడినట్లు బాధితురాలు ఫిర్యాదులో వెల్లడించింది. ప్రస్తుతం ఈ ఘటనను భారత్‌లోని బ్రిటన్ హైకమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కర్ణాటకలో కూడా ఇదేతరహా ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కొప్పళ జిల్లాలో కొందరు నిందితులు విదేశీ పర్యటకులపై దాడి చేసి, ముగ్గురిని కాల్వలోకి తోసి, ఇద్దరు మహిళలపై అత్యాచారానికి పాల్పడిన సంగతి తెలిసిందే. నదిలో పడినవారిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. అత్యాచారానికి గురైన వారిలో ఇజ్రాయెల్‌కు చెందిన మహిళ ఉందని పోలీసులు తెలిపారు.

# ఆత్మగౌరవమే మా ప్రాణం.. హక్కులను హరిస్తే ఊరుకోం

**- తమిళనాడు సీఎం స్టాలిన్**



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మరోసారి మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ విద్యావిధానం ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచేది కాదని, దానిని రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జాతీయ విద్యావిధానం పేరుతో త్రిభాషా విద్యావిధానాన్ని, నిర్బంధ హిందీ అమలు చేయడానికి, పునర్విభజన సాకుగా లోక్‌సభ స్థానాలను తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తూ రాష్ట్రమంతటా గురువారం నిరసన సభలు జరిగాయి. తిరువళ్లూరు జిల్లా తిరుపాచ్చూరు కేపీఎస్ క్రికెట్ అకాడమీ మైదానంలో జరిగిన నిరసన సభలో స్టాలిన్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయినుండే నిరుపేద విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా, దేశమంతటా హిందీ భాషకు పట్టం కట్టేలా ఉండటం వల్లే జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ విద్యావిధానాన్ని అమలు చేయకపోతే నిధులివ్వమంటూ కేంద్రంలోని బీజేపీ పాలకులు బెదరిస్తున్నారని, విద్యా శాఖ మంత్రి తమిళ ఎంపీలను, తమిళులను అనాగరికులంటూ విమర్శించి తన స్థాయిని దిగజార్చుకున్నారని, డీఎంకే ఎంపీల తీవ్ర నిరసనల కారణంగా అప్పటికప్పుడు ఆ మంత్రి తన మాటను ఉపసంహరించుకున్నారని చెప్పారు. తమిళులకు ఆత్మగౌరవం ఎక్కువని, కేంద్రానికి ఎప్పుడూ బానిసలుగా వ్యవహరించబోరన్నారు. హిందీభాషను నిర్బంధం చేయకపోతే నిధులిచ్చే ప్రసక్తేలేదంటూ రాష్ట్రాన్ని బెదరించడం నాగరికమా అంటూ స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మా నాన్నను విడిపించరూ..

# ట్రంప్‌నకు చిన్నారుల విజ్ఞప్తి




యుద్ధమంటే ఏంటో తెలియని ఆ పసి ప్రాణాలు.. హమాస్ చెరలో ఉన్న తమ తండ్రి కోసం అల్లాడిపోతున్నాయి. ఆయనను త్వరగా విడిపించి తమ వద్దకు చేర్చాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయెల్‌కు చెందిన ఇద్దరు చిన్నారులు.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో నెటిజన్ల హృదయాలను మెలిపెడుతోంది. 2023 అక్టోబరులో హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై మెరుపుదాడులు జరిపి.. అక్కడి పౌరులను అపహరించి బందీలుగా గాజాకు తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఇజ్రాయెల్ పౌరుడు ఒమరి మిరాన్ (47) ఇంటిపై దాడిచేసి అతడిని బలవంతంగా బందించి తీసుకెళ్లారు. నాటి నుంచి మిగిలిన బందీలతో కలిసి 500 రోజులకు పైగా హమాస్ చెరలో మగ్గిపోతున్నారు. తమ తండ్రిని విడిపించేందుకు సాయం చేయాలంటూ అతడి ఇద్దరు కుమార్తెలు ట్రంప్‌నకు విజ్ఞప్తి చేశారు. ఒమరి భార్య కూడా తమకు సహాయం చేయాలంటూ కోరారు.

ఇజ్రాయెల్– హమాస్ మధ్య కాల్పుల ఒప్పందంలో భాగంగా పలు దఫాల్లో కొందరు బందీలు గాజానుంచి విడుదలయ్యారు. అయితే.. ఈ ఒప్పందానికి ఆటంకం కలగడంతో మిగిలిన బందీల విడుదలపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉండగా.. గాజాలోకి ప్రవేశించే సరకు, ఇతర సరఫరాలను అడ్డుకున్న ఇజ్రాయెల్ తాజాగా కరెంటు సరఫరాను నిలిపివేసింది. మరోవైపు, హమాస్ మాత్రం రెండోదశ కాల్పుల విరమణ చర్చలు మొదలు పెట్టాలని కోరుతోంది. మానవతా సాయాన్ని అడ్డుకోవడం వంటి చర్యలతో ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిర్వీర్యం చేయాలని ఇజ్రాయెల్ ప్రయత్నిస్తే.. తమ చెరలో ఉన్న బందీలు ఇబ్బందులు పడతారని హెచ్చరించింది. ఇక, గాజాను స్వాధీనం చేసుకోవాలని భావిస్తున్నట్టు ట్రంప్ ఇటీవల ప్రకటించారు. పాలస్తీనీయులు పశ్చిమాసియాలోని వేరే ఏదైనా ప్రదేశానికి వెళ్లి స్థిరపడితే.. గాజాను అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. దీన్ని హమాస్ తీవ్రంగా తప్పుపట్టింది. శిథిలమైన గాజాను పునర్నిర్మించే ప్రణాళికలో భాగంగా అక్కడినుంచి ఎవరినీ బహిష్కరించబోమని తాజాగా ట్రంప్ స్పష్టం చేశారు.

### హైజాక్ ఆపరేషన్‌పై

# పాక్‌వి అబద్ధాలు: బలోచ్ రెబెల్స్





పాకిస్థాన్‌లో రైలు హైజాక్ ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మిలిటెంట్ల నుంచి బందీలను విడిపించేందుకు తాము నిర్వహించిన ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందని పాక్ ఆర్మీ చేసిన ప్రకటనను బలోచ్ వేర్పాటువాదులు ఖండించారు. తాము ఇంకా సైన్యంతో పోరాడుతున్నామని బలోచ్ లిబరేషన్ ఆర్మీ గురువారం తన ప్రకటనలో పేర్కొంది. ఈమేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి "బలోచిస్థాన్‌లోని బోలన్ జిల్లాలో ఆపరేషన్‌ను ముగించినట్లు పాక్ ఆర్మీ చేసిన ప్రకటన అబద్ధం. ఇరువర్గాల మధ్య పోరాటం జరుగుతోంది. పాక్ సైన్యం మరణించిన సైనికులు, రెబెల్స్ ఫొటోలు ఇంకా విడుదల చేయలేదు. సైన్యంవైపు భారీగా నష్టం జరుగుతోంది. బందీలుగా ఉన్న తమ సిబ్బందిని రక్షించుకోలేకపోయింది. సైనికుల స్థయిర్యం దెబ్బతినకుండా చూసుకునేందుకు వాస్తవ సంఖ్యను దాచి, తప్పుడు ప్రచారం చేస్తోంది" అని తన ప్రకటనలో పేర్కొంది. ఆర్మీ రక్షించిందని చెప్తున్న సిబ్బందిని యుద్ధనీతిని అనుసరించి, తామే విడుదల చేశామని పేర్కొంది. యుద్ధంలో తమను ఓడించలేక.. నిరాయుధులైన బలోచ్ ప్రజలపై పాక్ ఆర్మీ దాడులు చేస్తోందని మండిపడింది. ఇదిలాఉంటే.. రైలును హైజాక్ చేసిన వేర్పాటువాద బలోచ్ మిలిటెంట్లు 33 మందిని హతమార్చినట్టు పాకిస్థాన్ సైన్యం బుధవారం ప్రకటించింది. "21మంది ప్రయాణికులను వేర్పాటువాదులు హత్య చేశారు. ఈ ఆపరేషన్‌లో నలుగురు సైనికులు కూడా ప్రాణాలు కోల్పోయారు. మిలిటెంట్ల చెరలోని బందీలను రక్షించాం" అని సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ తెలిపారు. సుమారు 425మంది ప్రయాణికులతో క్వెట్టానుంచి పెషావర్‌కు వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్) వేర్పాటువాదులు బోలన్ ప్రాంతంలో మంగళవారం హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటనలతో హైజాక్ ఘటనకు తెరపడిందా.. లేదా అన్న విషయంలో అయోమయం నెలకొంది. ఇదిలావుంటే.. ఈ ఘటన నేపథ్యంలో బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పర్యటించారు. స్థానికంగా శాంతిభద్రతలను సమీక్షించడంతోపాటు బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపేందుకు అక్కడకు వెళ్లారు.

# ట్రంప్ ఎవ్వరినీ వదలరు

### జీ7 దేశాలను హెచ్చరించిన కెనడా

వాణిజ్య యుద్ధభయాలు జి–7 దేశాలను వెంటాడుతున్నాయి. తాజాగా ఆ గ్రూప్ విదేశాంగ మంత్రుల సమావేశంలోనూ ఈ అంశం చర్చకు వచ్చింది. కెనడా మంత్రి మెలానియో జోలీ మాట్లాడుతూ అమెరికాతో ముదురుతున్న ట్రేడ్‌వార్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. అగ్రరాజ్య చర్యలతో ఎదురయ్యే పరిణామాలపై మిగిలిన దేశాలను హెచ్చరించారు. "అత్యంత సన్నిహిత మిత్రదేశమైన మాతో అమెరికా ఇలా చేయగలిగితే.. ఇక ఎవరూ సురక్షితం కాదు" అని ఆమె వ్యాఖ్యానించారు. కెనడా రాబోయే విపత్తును ముందుగానే హెచ్చరిస్తోందన్నారు. అమెరికా చర్యలకు వ్యతిరేకంగా మిగిలిన మిత్రదేశాల మద్దతును కూడగట్టి ఎదుర్కొనేందుకు వీలుగా జోలీ ఈ చర్యలు చేపట్టినట్టు భావిస్తున్నారు. మరోవైపు కెనడా సార్వభౌమత్వాన్ని ప్రశ్నిస్తూ ట్రంప్ తరచూ చేస్తున్న వ్యాఖ్యలను కూడా జోలీ ఈ సమావేశంలో ప్రస్తావించారు. కెనడా అలాంటి బెదిరింపులకు ఏమాత్రం వెనక్కి తగ్గదని ఆమె పేర్కొన్నారు. ఐరోపా సమాఖ్యతో కలిసి యుద్ధవిన్యాసాలు చేయడం, ఆయుధతయారీ వంటివి తమ సార్వభౌమత్వ రక్షణకు అవసరమని వ్యాఖ్యానించారు. మరోవైపు అమెరికా మంత్రి మార్కో రూబియో మాత్రం కెనడా స్వాధీనంపై ట్రంప్ వ్యాఖ్యలను కొంచెం తేలిగ్గా చూపించే యత్నం చేశారు. ఆర్థిక కోణంలో మాత్రమే తమ అధ్యక్షుడు కెనడాను 51వ రాష్ట్రం కావాలని ఆకాంక్షించారని వివరణ ఇచ్చారు. "ఒకవేళ కెనడా 51వ రాష్ట్రం అయితే అప్పుడు సరిహద్దుల గురించి, ఫెంటెనిల్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నది ట్రంప్ భావన" అని రూబియో సర్దిచెప్పారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ "జి–7 సమావేశానికి ఉద్దేశించిన అంశాలపై దృష్టి పెట్టాలని.. అంతేకానీ.. ఇది మేము కెనడాను ఆక్రమిస్తాం. అన్నందుకు ఏర్పాటు చేసిన సమావేశం కాదు" అని వ్యాఖ్యానించారు.

అమెరికా–కెనడా సంబంధాలు చరిత్రలో ఎన్నడూ లేనిస్థాయిలో పతనం అయ్యాయి. కెనడా ఉక్కు, అల్యూమినియంపై సుంకాలను 50 శాతానికి పెంచుతానని తొలుత ప్రకటించిన ట్రంప్.. ఆ తర్వాత వెనక్కి తగ్గారు. 25శాతమే అమలు చేస్తామని ప్రకటించారు. దీనికి కెనడా కూడా తీవ్రంగా స్పందించింది. వాషింగ్టన్ నుంచి దిగుమతి అయ్యే 20 బిలియన్ డాలర్ల వస్తువులపై ప్రతీకార సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది.

### మరణానికి కొద్ది నిమిషాల ముందు..

## బయటపడిన సుచిర్ బాలాజీ వీడియో ఫుటేజీ




చాట్ జీపీటీ మాతృ సంస్థ 'ఓపెన్ ఏఐ'లో నాలుగేళ్లు పరిశోధకుడిగా పనిచేసిన ప్రజా వేగు (విజిల్ బ్లోయర్), భారత సంతతి వ్యక్తి సుచిర్ బాలాజీ (26) గతేడాది అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంగతి తెలిసిందే. మృతిపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా అతడి మరణానికి ముందు సీసీటీవీలో రికార్డయిన ఫొటోను సుచిర్ తల్లి పూర్ణిమారావు పంచుకున్నారు. ఆ ఫొటోలో అతడు ఫుడ్ పార్శిల్ పట్టుకొని లిఫ్ట్ ఎక్కుతున్నట్టు కనిపిస్తుంది. సుచిర్ చనిపోయిన రోజు రాత్రి 7:30 నిమిషాలకు సంబంధించిన ఫొటో ఇది. చీఫ్ మెడికల్ ఎగ్జామినర్ కార్యాలయం ఈ వీడియోను చూసింది. అయినప్పటికీ.. అతడు నిరాశకు లోనయ్యాడని, ఆత్మహత్య చేసుకున్నాడని నిర్ధారించారు. అంతేకాదు.. అతడు చనిపోయిన 3 రోజుల తర్వాత నిర్వహించిన శవపరీక్షలో డ్రగ్ మోతాదు ఎక్కువగా ఉందని తెలిపారు. అయితే, అది తప్పని మేము చేయించిన రిపోర్టులో వెల్లడైంది. దీనిపై టాక్సికాలజిస్ట్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నాం' అని పూర్ణిమారావు పేర్కొన్నారు. ఇదిలాఉండగా.. సుచిర్ హత్యకు దీర్ఘకాలంగా ప్రణాళికలు రచించినట్లు ఆమె మరో పోస్టులో ఆరోపించారు. అతడు నివసించే అపార్టుమెంటు గ్యారేజీలో, ఎలివేటర్లో ఎలాంటి సీసీటీవీలు లేవని, వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్నా అవి పనిచేయడం లేదని తెలిపారు.

ఇక, శాన్‌ఫ్రాన్సిస్కోలోని తన అపార్ట్‌మెంట్‌లో గతేడాది నవంబర్ 26న బాలాజీ మృతి చెందాడు. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు దీన్ని ఆత్మహత్యగా పేర్కొన్నారు. దీనిపై అతడి తల్లి పూర్ణిమారావు న్యాయపోరాటానికి దిగారు. తన కుమారుడి మరణంపై అనుమానాలు వ్యక్తంచేస్తూ ప్రైవేట్ ఇన్వెస్టిగేటర్‌ను నియమించుకొని రెండోసారి శవపరీక్ష చేయించారు. అయితే ఆ ఫలితాలు పోలీసులు తెలిపిన దానికి భిన్నంగా ఉన్నట్టు ఆమె వెల్లడించారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని పోలీసులు తమతో పేర్కొన్నట్టు పూర్ణిమా వెల్లడించారు. ఆ దృశ్యాల కోసం అపార్టుమెంటు సిబ్బందిని ఎవరూ సంప్రదించలేదని తెలిసిందని ఆమె పేర్కొనడం గమనార్హం. మరోవైపు.. సుచిర్ మృతిపై ఆ టెక్ సంస్థ సైతం స్పందించింది. అతడి మరణం తమను ఎంతో కలచివేసిందని సామాజిక మాధ్యమ వేదికగా పోస్ట్ పెట్టింది. ఈ కేసులో అవసరమైన సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది.

# కర్స్క్‌లో రష్యా బలగాల పైచేయి

**అతి పెద్ద పట్టణం తిరిగి రష్యా స్వాధీనం**

ఉక్రెయిన్– రష్యా మధ్య శాంతి ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలో యుద్ధభూమిలో పుతిన్ సేనలు పైచేయి సాధించాయి. కర్స్క్ రీజియన్‌లోని అతిపెద్ద పట్టణమైన సుడ్జాను తిరిగి తమ అధీనంలోకి తెచ్చుకున్నట్టు రష్యా రక్షణశాఖ వెల్లడించింది. ఈ రీజియన్‌లోని కొంతభాగాన్ని గతేడాది ఉక్రెయిన్ బలగాలు అనూహ్యంగా ఆక్రమించిన విషయం తెలిసిందే. కొన్నిరోజులుగా కర్స్క్ ప్రాంతంలో రష్యా బలగాలు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. దానిని పూర్తిగా స్వాధీనం చేసుకోవడం మొదలుపెట్టాయి. అమెరికానుంచి సాయం నిలిచిపోవడంతో మాస్కో సేనలు రెట్టించిన ఉత్సాహంతో దాడులు చేస్తున్నాయి. వీటికితోడు ఉత్తరకొరియా దళాలు కూడా గత కొన్ని రోజులుగా ఇక్కడ పలు ఉక్రెయిన్ స్థావరాలను స్వాధీనం చేసుకొన్నాయి. తాజాగా అతిపెద్ద పట్టణమైన సుడ్జాను పుతిన్ సేనలు అధీనంలోకి తెచ్చుకున్నాయి. ఇదిలాఉంటే.. పశ్చిమ రష్యాలోని కర్స్క్‌లో బుధవారం పుతిన్ పర్యటించిన సంగతి తెలిసిందే. రష్యా దళాల కంట్రోల్ సెంటర్‌కు అధ్యక్షుడు వెళ్లారు. ఆయన మిలిటరీ దుస్తుల్లో ఉన్న దృశ్యాలను మీడియా ప్రసారం చేసింది. ఈ సందర్భంగా యుద్ధ భూమిలోని పరిస్థితులను రష్యన్ జనరల్ స్టాఫ్ హెడ్ వలెరీ జెరసిమోవ్.. పుతిన్‌కు వివరించారు. కొంతమంది ఉక్రెయిన్



సైనికులు తమకు లొంగిపోయినట్టు తెలిపారు. వీలైనంత త్వరగా ఈ ప్రాంతం నుంచి కీవ్ దళాలను తరిమికొట్టాలని అధ్యక్షుడు ఆదేశించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే తాజా ప్రకటన వచ్చింది.

### పర్ఫ్యూమ్ గిఫ్ట్‌లమాటున బాంబులు: రష్యా

ఇదిలావుంటే.. ఉక్రెయిన్– రష్యామధ్య కాల్పుల విరమణ, శాంతి చర్చలకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. ఇరువర్గాల మధ్య దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈక్రమంలో తమ సైనికాధికారులకు మెయిల్ బాంబులను పంపిస్తోన్న అనుమానితుడిని అరెస్టు చేసినట్టు రష్యా సైన్యం వెల్లడించింది. ఇది కీవ్ పనేనని ఆరోపించింది. ఉక్రెయిన్‌పై 2022లో దండయాత్ర మొదలుపెట్టిన రష్యా.. కీవ్‌కు సహకరిస్తున్నారన్న ఆరోపణలతో వందలాది మందిని అరెస్టు చేస్తోంది. ఈక్రమంలో మాస్కో, వోరోనెజ్, క్రాస్నోడర్, సారాటోవ్ ప్రాంతాల్లోని రష్యా అధికారులకు పేలుడు పదార్థాలతో కూడిన పార్సిళ్లను ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ గుర్తించింది. చెల్యాబిన్స్క్ ఎయిర్‌పోర్టులో స్క్రీనింగ్ సమయంలో పార్శిళ్లను తనిఖీ చేయడం ద్వారా ఈ దాడి కుట్ర భగ్నం చేశామని ఎఫ్ఎస్‌బీ వెల్లడించింది. పెర్ఫ్యూమ్ గిఫ్టుల మాదిరిగావున్న ఐదు పార్శిళ్లలో శక్తివంతమైన పేలుడు పదార్థాలు ఉన్నట్టు గుర్తించామని తెలిపింది. తాము అదుపులోకి తీసుకున్న 22 ఏళ్ల రష్యా పౌరుడిని ఉక్రెయిన్ స్పెషల్ సర్వీసెస్ నియమించుకుందని పేర్కొంది. ఇతడికి డబ్బులు ఆశచూపారని, కానీ, బాంబులు పంపిన తర్వాత ఇతడితో సంప్రదింపులు నిలిపివేశారని రష్యా సైన్యం తెలిపింది. రష్యా సైన్యాధికారులను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ దాడులకు పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయి. కొన్ని ఘటనలను జెలెన్ స్కీ సైన్యం కూడా ధ్రువీకరించింది. అయితే, ఇలా కీవ్‌కు సాయం చేస్తున్నట్టు అనుమానిస్తూ అరెస్టయ్యే వారిపై రష్యా భద్రతా దళాలు దేహద్రోహం కింద కేసులు నమోదు చేస్తున్నాయి. న్యాయస్థానాలు కూడా కఠిన శిక్షలు విధిస్తున్నాయి.







### చరిత్ర సృష్టించిన జియో హాట్‌స్టార్ ..

# భారత్, చైనా జనాభాను దాటేసిన ఛాంపియన్స్ ట్రోఫీ వ్యూస్

*ఇటీవల ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ దిగ్విజయంగా ముగిసింది. పాకిస్థాన్ ఆతిథ్యం ఇచ్చిన ఈ టోర్నీ విజేతగా టీమ్ ఇండియా నిలిచింది. ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన భారత్ దాదాపు 12 ఏళ్ల తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకుంది. ఇప్పటికే ఫైనల్ మ్యాచ్ వ్యూవర్షిప్ పరంగా రికార్డులు సృష్టించింది. భారత్ కివీస్ పోరుకు 90 కోట్లకు పైగా వ్యూస్ వచ్చాయి. ఏక కాలంలో 6.1 కోట్ల మంది వీక్షించారు. మరి మొత్తం ఛాంపియన్స్ ట్రోఫీకి ఎన్ని వ్యూస్ వచ్చాయి ఉంటాయో ఓ సారి అంచనా వేయండి?*

*భారత్ – చైనా జనాభాకు డబుల్*

*జియోహాట్‌స్టార్‌లో ప్రసారమైన ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లకు భారీ ఆదరణ దక్కింది. భారత్ (143 కోట్లు), చైనా (141 కోట్లు) జనాభా కంటే రెట్టింపుగా ఈ మ్యాచ్‌లకు వ్యూస్ రావడం విశేషం.. మొత్తం 540.3 కోట్ల వ్యూస్ రాగా.. 11వేల కోట్ల నిమిషాలపాటు వాంటైమ్లో నమోదైంది. ఏకకాలంలో 6.2 కోట్ల వ్యూవర్స్ కూడా చూసినట్లు కథనాలు వస్తున్నాయి. సబ్‌స్క్రిప్షన్లకు సంబంధించి జియోహాట్ స్టార్ డిజిటల్ సీఈవో కిరణ్ మణి ఓ ప్రకటన విడుదల చేశారు. "ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి భారీ ప్రేక్షకాదరణ దక్కింది. కోట్ల మంది చూసే అవకాశం వచ్చింది. భారత్ ఆస్ట్రేలియా మ్యాచ్ సందర్భంగా ఒక్క రోజులోనే అత్యధిక సబ్‌స్క్రిప్షన్లను సాధించడం జరిగింది" అని కిరణ్ వెల్లడించారు.*

*హిందీ మాట్లాడే ప్రాంతాల నుంచే 38 శాతం లైవ్ స్ట్రీమింగ్ వ్యూస్ వచ్చినట్లు మరొక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, గోవా, పంజాబ్, హరియాణా రాష్ట్రాల నుంచి వ్యూస్ భారీగా వచ్చాయి. జియో హాటార్ తొలిసారి ఐసీసీ ఈవెంట్‌ను బ్రాడ్‌కాస్టింగ్ చేసిందని.. 9 ప్రాంతీయ భాషల్లో కామెంటేటరీని అందుబాటులోకి తీసుకొచ్చింది.*

# హ్యాట్సాఫ్ రాహుల్..

### నడవలేని స్థితిలో కూడా జట్టు కోసం అలా!



టీమిండియా మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ ఎడమ కాలికి ఇటీవల పెద్ద గాయమైన సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తున్న ఆయనకు క్రికెట్ ఆడే సమయంలో ఈ గాయం తగిలింది. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. అయితే.. మార్చి 22న ఐపీఎల్ ప్రారంభం కానుంది. దీనికోసం మిగిలిన జట్లు సన్నద్ధం అవుతున్నాయి. కానీ, రాజస్థాన్ రాయల్స్ మాత్రం కోచ్ లేకుండా ప్రాక్టీస్ చేయాల్సి వస్తోంది.

తన పరిస్థితి వల్ల జట్టు నష్టపోకూడదనే ఉద్దేశంతో.. సరిగా నడవలేని స్థితిలో ఉన్నా రాహుల్ జైపూర్లోని ట్రైనింగ్ క్యాంప్‌నకు వచ్చారు. తన ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా జట్టుకు ప్రాధాన్యం ఇస్తూ ఇబ్బందిపడుతూనే ప్రాక్టీస్ మైదానంలో అడుగుపెట్టారు. ఈ నేపథ్యంలోనే రాజస్థాన్ రాయల్స్ తమ కోచ్‌ను ఉద్దేశిస్తూ 'ఎక్స్' (గతంలో ట్విటర్)లో స్పెషల్ వీడియో షేర్ చేసింది. 'ఇలాంటి కోచ్‌ను ఎక్కడా చూడలేం. ఆయనకు గాయమవ్వడం బాధాకరం' అంటూ పోస్టు చేసింది.

ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు స్పందిస్తున్నారు. 'నిజంగా ఇలాంటి కోచ్ ఉంటే జట్టుకు విజయం దక్కకుండా ఎలా ఉంటుంది'.. 'ఇలాంటి కోచ్ దొరకడం నిజంగా మీ అదృష్టం'.. 'మీ ఆరోగ్యం జాగ్రత్త సర్.. 'ఆయన ఎప్పుడూ జట్టు కోసమే ఆలోచిస్తుంటారు'.. 'ఇది ఆయన నిబద్ధతకు అద్దం పడుతోంది' అంటూ రాహుల్ ద్రావిడ్‌పై ప్రశంసలు కురిపించారు.

కాగా.. భారత ప్రధాన కోచ్‌గా పనిచేసిన రాహుల్ ద్రవిడ్.. గతేడాది టీమిండియా ఐసీసీ ట్రోఫీని సాధించడంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. నాడు బీసీసీఐ తనకు రూ.5 కోట్ల నజరానా ప్రకటించింది. మిగిలిన కొందరికి తక్కువ బోనస్ రావడంతో.. అందరికీ సమానంగా పంచాలని కోరుతూ తన బోనస్ మొత్తాన్ని సగానికి తగ్గించుకున్నారు. ఈ సంఘటన ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమంటూ నెటిజన్లు ఆ రోజులను గుర్తుచేసుకున్నారు.

# రూ. 5 కోట్లతో ఉప్పల్ స్టేడియం ముస్తాబు

ఐపీఎల్ 2025 సీజన్‌కు ఉప్పల్ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ హోమ్ గ్రౌండ్ అయిన ఉప్పల్ వేదికగా ఏడు లీగ్ మ్యాచ్‌లతో సహా రెండు ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఐపీఎల్ 2025 సీజన్ కోసం ఉప్పల్ స్టేడియాన్ని రూ. 5 కోట్లతో ముస్తాబు చేస్తున్నామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు తెలిపారు. బుధవారం బీసీసీఐ, సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రతినిధులతో కలిసి జగన్ మోహన్ రావు గ్రౌండ్ రినోవేషన్ పనులను పరిశీలించారు.

మరో పది రోజుల్లో ఉప్పల్ వేదికగా తొలి ఐపీఎల్ మ్యాచ్ జరగనుండడంతో పనుల్లో వేగం పెంచాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. స్టేడియం మొత్తం పెయింటింగ్ వేస్తున్నామని, నార్త్ స్టాండ్స్‌లో కొత్త రెస్ట్ రూమ్స్ నిర్మిస్తున్నామని, క్రికెటర్ల డ్రెస్సింగ్ రూమ్స్, కార్పొరేట్ బాక్సుల్లో ఏసీలు, టైల్స్ మారుస్తున్నామని చెప్పారు. స్టేడియానికి కొత్త రూపు తెచ్చేందుకు హెచ్‌సీఏ నుంచి సుమారు రూ. 5 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు.



సీఎస్ఆర్ పథకం కింద సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం కూడా సహకారం అందిస్తుందని జగన్ మోహన్ రావు తెలిపారు. జగన్ మోహన్ రావుతో పాటు బీసీసీఐ నుంచి వైభవ్, యువరాజ్, సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం నుంచి శరవానణ్, రోహిత్ స్టేడియంలో జరుగుతున్న పనులను పరిశీలించారు.

# ఒక్క అడుగు.. చరిత్ర సృష్టించనున్న కోహ్లీ!




ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సీజన్ ముగియడంతో ఇప్పుడు అందరి కళ్లు ఐపీఎల్ 2025పైనే ఉంది. మరో 8 రోజుల్లో ఈ మెగా లీగ్ గ్రాండ్ గా ప్రారంభం కానుంది. అయితే ఐపీఎల్ హిస్టరీలో గ్రేటెస్ట్ బ్యాటర్స్ లో ఒకరైన విరాట్ కోహ్లీకి.. ఈ సీజన్ లో ఓ అరుదైన రికార్డు ఊరిస్తోంది. అదేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**ఒక్క అడుగు దూరంలో...**

విరాట్ కోహ్లీ కెరీర్ లో 250 ఐపీఎల్ మ్యాచులు ఆడి 8,004 పరుగులు చేశాడు. అందులో 8 సెంచరీలు, 55 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. గత 17 ఏళ్లగా ఒకే ఫ్రాంఛైజీకి (ఆర్సీబీ) ప్రాతినిథ్యం వహిస్తూ నిలకడగా రాణిస్తున్నాడు. ఇప్పుడు అతడు 18వ సీజన్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. అయితే విరాట్ ఈ టీ20 క్రికెట్ లో చరిత్ర సృష్టించడానికి కేవలం ఒక్క సెంచరీ దూరంలోనే ఉన్నాడు.

**తొలి క్రికెటర్‌గా ఘనత..**

ప్రస్తుతం టీ20 క్రికెట్ లో భారత్ తరఫున అత్యధిక సెంచరీల నమోదు చేసిన ఆటగాడిగా కోహ్లీ కొనసాగుతున్నాడు. అందులో 8 ఐపీఎల్ లో బాదగా.. ఒకటి అంతర్జాతీయ సెంచరీ. ఆ అంతర్జాతీయ శతకాన్ని 2022లో టీ20 ఆసియా కప్ లో అఫ్ఘానిస్థాన్ పై బాదాడు. ఓవరాల్‌గా అత్యధిక టీ20 సెంచరీలు బాదిన ఆటగాళ్ల జాబితాలో క్రిస్ గేల్ (22) అగ్రస్థానంలో నిలిచాడు. ఆ తర్వాత పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ అజామ్ 11 శతకాలతో ఉండగా, విరాట్ 9 శతకాలతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇప్పుడు కోహ్లీ ఐపీఎల్ లో మరో సెంచరీ బాదితే టీ20 క్రికెట్ లో బాబర్ అజామ్ తో కలిసి అత్యధిక సెంచరీల రికార్డును సమం చేసినట్టువుతుంది. అలాగే భారత్ తరఫున 10 సెంచరీలు బాదిన తొలి ప్లేయర్ గానూ నిలుస్తాడు. పైగా రీసెంట్‌గా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీతో అతడు ఫామ్ లోకి వచ్చిన సంగతి తెలిసిందే. కాగా, ఐపీఎల్ 2025 ఓపెనింగ్ మ్యాచ్ లో (మార్చి 22) డిఫెండింగ్ ఛాంపియన్స్ కేకేఆర్ తో ఆర్సీబీ తలపడనుంది.



# 'ఏజెంట్'.. ముందే వచ్చేశాడుగా


అక్కినేని అభిమానులకు సర్ప్రైజ్. రెండేళ్లుగా ఎదురు చూస్తున్న 'ఏజెంట్' సినిమా ఎట్టకేలకు స్ట్రీమింగుకు వచ్చేసింది. అఖిల్ కథానాయకుడిగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. సాక్షి వైద్య కథానాయిక. మమ్ముట్టి కీలక పాత్రలో నటించారు. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన సినిమా విడుదలై సుమారు రెండేళ్లు అవుతోంది. బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అయితే ఓటీటీలో చూద్దామని ఎదురుచూసిన అభిమానులకు నిరాశే ఎదురవుతూ వచ్చింది..

ఎట్టకేలకు మార్చి 14నుంచి సోనీ లైవ్ వేదికగా స్ట్రీమింగ్ కానున్నట్టు సదరు ఓటీటీ సంస్థ ప్రకటించింది. అయితే, అఖిల్ అభిమానులకు సర్‌ప్రైజ్ ఇస్తూ ఇంకాస్త ముందుగానే ఓటీటీలోకి వచ్చేసింది. గురువారం సాయంత్రం నుంచే సోనీ లివ్ దీనిని అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం తెలుగుతోపాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ప్రేక్షకులు వీక్షించవచ్చని చెప్పింది.

**కథేంటంటే:** రిక్కీ అలియాస్ రామకృష్ణ (అఖిల్) మధ్య తరగతి కుర్రాడు. స్పై కావడమే లక్ష్యంగా 'రా'లో చేరేందుకు మూడుసార్లు పరీక్ష రాసి విఫలమవుతాడు. ఇలా ప్రయత్నిస్తే లాభం లేదనుకొని ఎథికల్ హ్యాకింగ్ నైపుణ్యాలతో ఏకంగా 'రా' చీఫ్ డెవిల్ అలియాస్ మహదేవ్ (మమ్ముట్టి) సిస్టవమ్‌ను హ్యాక్ చేసి.. అతని దృష్టిలో పడే ప్రయత్నం చేస్తాడు. మరోవైపు భారతదేశాన్ని నాశనం చేసేందుకు గాడ్ అలియాస్ ధర్మ (డినో మోరియా) చైనాతో కలిసి మిషన్ రాబిట్ పేరుతో భారీ కుట్రకు ప్రణాళిక సిద్ధం చేస్తాడు. అయితే వీళ్ల కుట్రను ఛేధించి, మిషన్ రాబిట్‌ను అడ్డుకునేందుకు మహదేవ్.. రిక్కీని రంగంలోకి దించుతాడు. రిక్కీని అంత పెద్ద మిషన్ కోసం మహదేవ్ ఎందుకు రంగంలోకి దింపాడు? ఆయన ఆదేశాల్ని పక్కకుపెట్టి రిక్కీ కొని తెచ్చుకున్న ప్రమాదాలేంటి? అసలు స్పై కావాలని రిక్కీ ఎందుకంత బలంగా కోరుకున్నాడు? అనే అంశాలతో సినిమాను నిర్మించారు.

## బ్లో అప్

నభానటేష్



# అలా జాగ్రత్తపడుతున్నా



తన కుమార్తె రాహా విషయంలో బాలీవుడ్ నటి అలియాభట్ ఇటీవల ఒక కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. రాహా గోప్యతకు భంగం కలగకుండా ఉండేలా.. పాపకు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టా నుంచి తొలగించారు. ఇదే విషయమై తాజాగా ఆమె విలేకర్లతో మాట్లాడారు. పాప సంరక్షణ కోసమే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. "మా ఇంట్లోకి దుండగులు చొరబడి.. రాహాను నాకు దూరంగా తీసుకువెళ్లిపోతున్నట్టు ఓసారి పీడకల వచ్చింది. అంతకంటే దారుణమైన కల మరొకటి ఉండదు. అందుకే పాప సంరక్షణ కోసం తగిన జాగ్రత్తలు పాటించాలని నిర్ణయించుకున్నా. తన గోప్యతకు భంగం కలగకుండా ఉండేలా అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నాం. కాబట్టి, మా అభ్యర్ధనను అర్థం చేసుకోండి. మా అనుమతి లేకుండా తన ఫొటోలు తీయొద్దు. ఒకవేళ ఎప్పుడైనా మాతోపాటు పాప ఫొటోలను తీస్తే.. తన మొహం కనిపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోగలరు. సరైన సమయం వచ్చాక ఆమెను తప్పకుండా మేమే మీ అందరి ముందుకు తీసుకువస్తాం" అని అలియా చెప్పారు. తాము ఎంత చెప్పినా వినకపోతే వారిపై తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పాప జన్మించిన తర్వాత తన జీవితం ఎంతో మారిందన్నారు. సమయానుగుణంగా తాను పరుగులు పెడుతున్నానని తెలిపారు. "పాప రాకతో నా జీవితం పరిపూర్ణమైనట్లు అనిపిస్తుంది. తను పుట్టాక నేను ఎంతో మారాను. ప్రస్తుతం నాకు రోజులు ఎంతో బిజీ బిజీగా గడుస్తున్నాయి. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకూ వర్క్, పర్సనల్ లైఫ్‌కు సంబంధించిన పనులతో జీవితాన్ని గడుపుతున్నా. నా జీవితం పరుగులు పెడుతున్నట్లు అనిపిస్తుంది. రాహాతో ఉన్నప్పుడు నేను కూడా చిన్నపిల్లని అయిపోతా. అన్ని విషయాల్లో తనకు స్వేచ్ఛనిస్తుంటా" అని వెల్లడించారు. ఈ ఏడాది జరగనున్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో తాను పాల్గొంటున్నట్లు ఆమె చెప్పారు. ఆ కార్యక్రమం కోసం తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

# అందుకే.. సోషల్ మీడియాకు దూరంగావుంటా

సినిమాలో అద్భుతమైన నటన కనబరచడం ఎంత ముఖ్యమో దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం కూడా అంతే ముఖ్యం. తమ సినిమాలను సోషల్ మీడియా ద్వారా ప్రేక్షకులకు మరింత చేరువచేస్తుంటారు నటీనటులు. అయితే బాలీవుడ్ హీరో జాన్ అబ్రహం మాత్రం తనకు సోషల్ మీడియా నచ్చదని చెప్పారు. సినిమాల ప్రచారం కోసం కూడా దాన్ని తక్కువగా ఎంచుకుంటానన్నారు. తన తాజా చిత్రం ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో జాన్ అబ్రహం సోషల్ మీడియా గురించి మాట్లాడారు. "ఈ రోజుల్లో ప్రజలు ఎదుర్కొంటోన్న పెద్ద సమస్యల్లో గుర్తింపు ఒకటి. తెలియని వ్యక్తులనుంచి గుర్తింపు కోరుకుంటున్నారు. అది చాలా భయంకరంగా మారింది. రోజూ మనం ఏం చేసినా వాటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. దాని ఆధారంగా ఎదుటివారు మన గురించి ఒక నిర్ణయానికి వచ్చేస్తున్నారు. నా దృష్టిలో అది అంత అవసరమైన విషయం కాదు. ఏది ముఖ్యమో, ఏది కాదో.. అందరూ అర్థం చేసుకోవాలి. సినీ పరిశ్రమలోని వారికి కూడా ఇదే వర్తిస్తుంది. నేను ఎన్నో సంవత్సరాలుగా ఇలానే ఉంటున్నాను. సోషల్ మీడియాలో ఎక్కువ యాక్టివ్‌గా ఉండను" అన్నారు. ప్రస్తుతం జాన్ అబ్రహం 'ది డిప్లొమాట్'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. శివమ్ నాయర్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా ఇది రూపొందింది. భారతీయ దౌత్యవేత్త జేపీ సింగ్ నిజ జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 14న ప్రేక్షకుల ముందుకురానుంది.



# ఔను.. ఆమెతో డేటింగ్‌లోవున్నా!



తన పుట్టినరోజు (మార్చి 14) సందర్భంగా మీడియా సమక్షంలో సెలబ్రేషన్స్ చేసుకున్నారు బాలీవుడ్ నటుడు ఆమిర్‌ఖాన్. విలేకర్లు, ఫొటోగ్రాఫర్ల ఎదుట కేక్ కట్ చేసిన ఆయన అనంతరం వారితో కాసేపు మాట్లాడారు. తన తదుపరి సినిమా విశేషాలు, షారుక్, సల్మాన్లతో తన అనుబంధం గురించి మాట్లాడారు. తన స్నేహితురాలు గౌరీ స్ప్రాట్తో డేటింగ్‌లో ఉన్నట్టు ఆమిరాఖాన్ ఈ సందర్భంగా వెల్లడించారు. 25ఏళ్లుగా తనకు ఆమె తెలుసన్నారు. స్ప్రాట్ ప్రస్తుతం బెంగుళూరులో నివశిస్తున్నారు. ఆమెకు ఆరేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. అలాగే తన డ్రీమ్ ప్రాజెక్ట్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. "మహాభారత్ నా డ్రీమ్ ప్రాజెక్ట్, భారీస్థాయిలో దానిని సిద్ధం చేయాలని అనుకుంటున్నాం. ఆమేరకు పనులు ప్రారంభిస్తున్నాం. స్క్రిప్ట్‌వర్క్ మాత్రమే మొదలు పెడుతున్నాం. దీని కోసం ఒక టీమును సిద్ధం చేసే పనిలో ఉన్నాం. మేము ఎన్నో విషయాల గురించి అన్వేషిస్తున్నాం. చూడాలి ఏం జరుగుతుందో" అని ఆయన చెప్పారు. ఇదే ప్రాజెక్ట్ గురించి ఆయన గతంలోనూ మాట్లాడారు. మహాభారత్ మీద సినిమా చేయడమంటే ఒక యజ్ఞంతో సమానమన్నారు. దాని విశిష్టతకు భంగం కలిగించకుండా సినిమా రూపొందించేందుకు శ్రమిస్తున్నానన్నారు. ఆ ప్రాజెక్ట్ విషయంలో తాను ఎంతో భయంతో ఉన్నట్టు కూడా చెప్పారు. బుధవారం సాయంత్రం షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్లను కలవడంపై ఆయన మాట్లాడారు.

"షారుక్, సల్మాన్లతో నాకు ఎంతో మంచి అనుబంధం ఉంది. తాజాగా వారిద్దరినీ కలవడం ఆనందంగా ఉంది. అయితే మేము మా పుట్టినరోజుల గురించి మాట్లాడుకోలేదు. ఎందుకంటే వాటి గురించి మాకు పెద్దగా గుర్తు ఉండదు. మీరు ఎప్పుడూ మాపై గాసిప్స్ రాస్తుంటారు. అందుకే ఈసారి మేము మీ గురించే గాసిప్స్ మాట్లాడుకున్నాం. మా ముగ్గురి కాంబోలో సినిమా వస్తే బాగుంటుందని మేము కూడా అనుకుంటున్నాం. అయితే సరైన స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్నాం" అని తెలిపారు. మరోవైపు 2021లో అమిర్‌ఖాన్-కిరణ్ రావ్‌లు తమ వైవాహిక బంధానికి ముగింపు పలికిన సంగతి తెలిసిందే.